తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# మత్స్యకారులకు అందని భరోసా

కోట, మే 24 ప్రభాతవార్త : కడలిని నమ్ముకుని జీవనం సాగించే గంగ పుత్రులకు వేట నిషేధ సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. ఒకవైపు వేట లేక, మరోవైపు ప్రభుత్వం నుంచి పరిహారం అందక పిల్లలతో పస్తులు ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. వేట నిషేధం అమలులోకి వచ్చి సుమారు నెలరోజులు కావస్తున్నా ఇప్పటివరకు వారికి భరోసా అందలేదు. ఎన్నికల నేపథ్యంలో అర్హుల జాబితా రూపకల్పనపై అధికారులు దృష్టి సారించలేదు. దీంతో తమకు వేట నిషేధ పరిహారం ఎప్పుడు అందుతుందో అని మత్స్యకారులు ఎదురు చూస్తున్నారు.

**చేపల సంతానోత్పత్తి సమయంలో...**

సముద్రంలో చేపలు ఏప్రిల్, మే నెలల్లో గుడ్లు పెడతాయి. ఈ రెండు నెలల్లో సముద్రంలో వాతావరణం అనుకూలంగా ఉండటంతో అవి తమ సంతానాన్ని వృద్ధి చేసుకుంటాయి. ఈ సమయం వాటికి ఎంతో కీలకం. దీనికోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా నోటరైజ్డ్ మెకనైజ్డ్ బోట్లు ద్వారా సముద్రంలో వేట సాగించకూడదని నిబంధన విధించాయి. వేట నిషేధ సమయంలో ఉపాధి లేని వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నారు. రెండు నెలల విరామం కాలానికి ఒక్కొక్క మత్స్యకారుడికి రూ.10 వేలు చొప్పున పరిహారం అందిస్తారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈ ప్రక్రియకు కొంత ఆటంకం ఏర్పడింది. సముద్రంలో చేపల వేట నిషేధం ఏప్రిల్ 15 నుంచి అమల్లోకి వచ్చింది. గతంలో అయితే వేట నిషేధం ప్రారంభమైన రోజు నుంచే మత్స్యకార భరోసా అందించేందుకు అధికారులు సన్నాహాలు చేసేవారు. దీనికోసం సముద్రంలోకి వేటకు వెళ్లే బోట్లు, వాటిపై పనిచేసే మత్స్యకారుల వివరాలు సేకరించేవారు. ఈ వివరాలన్నీ బోటు చిత్రంతో సహా ప్రభుత్వం సూచించిన వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. కానీ ఈ ఏడాది ఎన్నికలు ఉండటంతో అధికారుల నుంచి ఏ విధమైన ఆదేశాలు రాకపోవడంతో సిబ్బంది పట్టించుకోలేదు.



నిలిపివేసిన వేట బోట్లు

# పకడ్బందీగా... ఓట్ల లెక్కింపుకు సంసిద్ధం

**- 28న కౌంటింగ్ సిబ్బందికి మొదటి విడత శిక్షణ - కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్**



అధికారులతో సమావేశమైన కలెక్టర్ సగిలి షన్మోహన్, జాయింట్ కలెక్టర్

చిత్తూరు, మే 24 ప్రభాతవార్త: సార్వత్రిక ఎన్నికలు- 2024కు సంబంధించి జూన్ 4వ తేదీ జరుగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియను రిటర్నింగ్ అధికారులు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి సన్నద్ధం కావాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ సగిలి షన్మోహన్, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు శుక్రవారం కౌంటింగ్ నిర్వహణకు సిబ్బంది నియామకం, సిబ్బంది ర్యాండమైజేషన్, కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ తరగతుల నిర్వహణ తదితరాలపై రిటర్నింగ్ అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన అన్ని ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారులు బాధ్యతతో చేయాలని, ఓట్ల లెక్కింపు ప్రక్రియలో రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమన్నారు. కౌంటింగ్ సజావు నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకంపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. సత్వరం కౌంటింగ్ సూపర్‌వైజర్స్, అసిస్టెంట్ సూపర్‌వైజర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, మైక్రో పరిశీలకులు, స్ట్రాంగ్ రూమ్స్ ఇన్‌ఛార్జ్, సిబ్బంది నియామకం పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ నిర్వహణకు కేటాయించబడ్డ సిబ్బందికి మొదటి ర్యాండమైజేషన్ చేసిన అనంతరం జిల్లా స్థాయిలో ఈనెల 28వ తేదీ మొదటి విడత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2వ విడత శిక్షణ తరగతులు జూన్ 3న పరిశీలకుల సమక్షంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఒక నియోజకవర్గ పరిధిలో జరిగే ఓట్ల లెక్కింపు అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలకు విడి విడిగా జరుగుతుందని రిటర్నింగ్ అధికారులు ఓట్ల లెక్కింపుకు అవసరమైన పూర్తి సిబ్బందిని నియమించుకోవాలన్నారు. అలాగే ప్రతి కౌంటింగ్ హాలులో వీడియోగ్రఫీతో పాటు సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన కంప్యూటర్లు, ఇంటర్నెట్ సౌకర్యం, కౌంటింగ్‌కు అవసరమైన టేబుల్స్, కుర్చీల ఏర్పాటు తదితరాలను ఆర్‌ఓలు ముందస్తుగా సరిచూసుకోవాలన్నారు. అలాగే సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని, పోటీలో వున్న అభ్యర్థులు కౌంటింగ్‌కు సంబంధించి ఏజెంట్ల నియామకంలో రిటర్నింగ్ అధికారికి ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ప్రతి రౌండ్ వారీగా సమాచారంను మీడియా సెంటర్‌కు చేరవేయడానికి సమాచార శాఖ తరపున ప్రతి నియోజకవర్గానికి ఒకరిని నియమించడం జరిగిందన్నారు. నియోజక వర్గాల్లో శాంతి భద్రతల నిర్వహణకు రిటర్నింగ్ అధికారులు పోలీసు అధికారులను సమన్వయం చేసుకొని ముందుకు వెళ్ళాలన్నారు. కౌంటింగ్‌కు ముందు వెల్లడి అయ్యే ఎగ్జిట్ పోల్స్ నేపథ్యంఒ జిల్లాలో ఎక్కడ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ముందస్తుగా అప్రమత్తంగా వుండాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ పుల్లయ్య, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, రిటర్నింగ్ అధికారులు మధుసూధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటశివ, చిన్నయ్య, మనోజ్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 6వ తేదీ వరకు... బాణాసంచా విక్రయాలపై నిషేధం

**- పెట్రోల్ బంకుల్లో వాహనాలకు మాత్రమే డిజీల్, పెట్రోల్ విక్రయాలు : ఎస్పీ**

చిత్తూరు, మే 24 ప్రభాతవార్త: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ పక్కాగా నిర్వహించడానికి పోలీసు యంత్రాంగం పకడ్బందీ చర్యలకు శ్రీకారం చుట్టిందని ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు గడువు సమీపిస్తుండటంతో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసు యంత్రాంగం కార్డెన్ అండ్ సెర్చ్‌లు ప్రారంభించిందన్నారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయంలో, అనంతరం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా శాంతిభద్రతలను పరిరక్షించే ఉద్దేశంతో చట్టవ్యతిరేక కార్యకలాపాలను అణచివేసి, అసాంఘీక శక్తుల ఏరివేతే లక్ష్యంగా జిల్లాలోని సమస్యాత్మక గ్రామాల్లో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు వరకు నిరంతరం అనుమానిత ప్రాంతాల్లో కార్డన్ అండ్ సెర్చ్‌లు నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే జిల్లాలో ఎక్కడా జూన్ 6వ తేదీ వరకు బాణాసంచా విక్రయించరాదని స్పష్టం చేశారు. అలాగే పెట్రోల్ బంకుల యాజమాన్యం, సిబ్బంది విడిగా బాటిల్స్‌లో, క్యాన్లలోగాని పెట్రోల్, డిజీల్‌ను నింపి విక్రయించరాదన్నారు. ఎవరైనా ఎలక్షన్ కమీషన్ ఆదేశాలను అతిక్రమిస్తే వారిపై చట్టరపమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో వున్నందున ఎవరైనా విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసినా, ఘర్షణలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇతర సమయాల్లో నమోదు చేసే కేసుల కంటే ఎన్నికల సమయంలో నమోదు చేసే కేసుల యొక్క తీవ్రత ఎక్కువగా వుంటుందన్నారు. ఎన్నికల సమయంలో ఘర్షణలకు పాల్పడే యువతకు ఎలాంటి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు పొందే అవకాశం వుండదని స్పష్టం చేశారు. యువత తమ ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో వుంచుకుని ఘర్షణలకు దూరంగా వుండాలని కోరారు. ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన, ఘర్షణలకు పాల్పడుతున్న సత్వరం సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు గాని, డయల్ 100 లేదా 112 నెంబర్లకు లేదా పోలీస్ వాట్సాప్ నెంబర్ 9440900005కు సమాచారం అందించాలన్నారు.

## మొదటి దఫా... కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

**తిరుపతి జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, తదితరులు

తిరుచానూరు, మే 24 ప్రభాతవార్త: సార్వత్రిక ఎన్నికలు 2024 పోలింగ్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో కౌంటింగ్ జూన్ 4న చేపట్టనున్న కౌంటింగ్ ప్రక్రియ కొరకు సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ పూర్తయిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జూన్ 4 తేదీ 23-తిరుపతి(ఎస్‌సీ) పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ నిర్వహణ శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో చేపట్టనున్న నేపథ్యంలో కౌంటింగ్ కొరకు సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ నేడు శుక్రవారం సాయంత్రం స్థానిక జిల్లా కలెక్టరేట్ మినీ మిటింగ్ హాలులో కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి సమక్షంలో పూర్తి చేయడం జరిగింది. ఎలెక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా వారు సూచించిన ఈసీఐ వెబ్‌సైట్ సాఫ్ట్‌వేర్‌లో కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ సహాయకులు, కౌంటింగ్ మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ సజావుగా పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. అందులోకౌంటింగ్ సూపర్‌వైజర్లు 310 మందికి గాను 311 మంది వివరాలను కౌంటింగ్ అసిస్టెంట్లు 383 గాను 395 మందిని, కౌంటింగ్ మైక్రో అబ్జర్వర్లు 346 గాను 347 మందిని వెరసి మొత్తం 1039 మంది 208 కౌంటింగ్ టేబుల్‌కు అవసరమైన నేపథ్యంలో రిజర్వుతో కలిపి 120 శాతంతో 1053 మందిని కౌంటింగ్ కొరకు కేటాయించడమైనదని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, మాన్ పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి చంద్రశేఖర్‌నాయుడు, ఎన్ఐసీ డీఐవో వెంకటేశ్వరులు పాల్గొన్నారు.

## ఎటువంటి సవాళ్లను ఎదుర్కోవడానికైనా సిద్ధంగా ఉండండి : ఎస్పి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పి హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైం, మే 24 ప్రభాతవార్త : ఎటువంటి సవాళ్లను ఎదుర్కోవడానికైనా సిద్ధంగా ఉండండని ఎస్పి హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ గ్రౌండ్‌లో స్పెషల్ పార్టీ పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి ఉద్యోగం జాగ్రత్తగా చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి స్పెషల్ పార్టీ టీంలో ఒకరికి నాయకత్వం బాధ్యతలను అప్పజెప్పాలని డిఎస్పిలను ఆదేశించడం జరిగిందన్నారు. ముఖ్యంగా జిల్లా పోలీస్ యంత్రాంగానికి స్పెషల్ పార్టీ పోలీసులు ఒక ఆయుధం వంటి వారు ఎంతమంది ఉన్నారు. ఏఏ డ్యూటీలు చేస్తున్నారని ఒకసారి తనిఖీ చేసుకొని ఓట్లు లెక్కింపు ప్రక్రియ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని కోరారు. అలాగే జిల్లాలో ఎక్కడ కూడా శాంతి భద్రతలు సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉంటాయని ఆశిద్దామన్నారు. అదే విధంగా శాంతి భద్రతల సమస్యలు తలెత్తినప్పుడు చాలా స్పిడ్‌గా వెళ్లాల్సి ఉంటుందన్నారు. దానికి తగినట్లు సిద్ధంగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సమయానుకులంగా ఉద్యోగం చేయాల్సి ఉంటుందని సూచించారు. శాంతి భద్రతల సమస్యలు వచ్చినప్పుడు స్పెషల్ పార్టీ పోలీసులు ముఖ్యంగా వెళ్లాల్సి ఉంటుందన్నారు. గతంలో ఎస్‌టిఎఫ్ సిబ్బంది ఎలాంటి రిమార్క్స్ లేకుండా అందరూ ఎస్పిలు దగ్గర పనిచేశారని గుర్తు చేశారు. ఇదే స్ఫూర్తితో రానున్న పది రోజుల్లో ఎంతో కీలకమైన సమయం అని, అందరూ బాగా పనిచేస్తారని, అందరూ బాగా చదువుకున్నటువంటి వారిని జిల్లాలో ఎస్‌టిఎఫ్, ఏం చేసినా దాని ప్రభావం జిల్లా పోలీసులపై ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదరణ ఎస్పిలు శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీలు, రవీంద్రారెడ్డి, రమణయ్య, ఆర్‌ఐలు స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపుపై... ఉత్కంఠత!

**-చివరి వరకు భవిష్యత్తు ప్రశ్నార్థకమే!**
**-అంచనాల్లో నాయకులు... ఆశల పల్లకీలో కార్యకర్తలు**



శ్రీకాళహస్తి,మే 24 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠత చోటు చేసుకుంది. గెలుపు ఎవ్వరికి నల్లేరుమీద నడక అయితే కాదు. కానీ ఒకరేమో మనం గెలిచేసాం. మెజారిటి ఎంత అనేది చూడాలనే ధీమాలో ఉండగా అధికార పార్టీ మాత్రం మనం మళ్ళీ గెలుస్తున్నాము. రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. మన నాయకుడు మంత్రి కాబోతున్నారనే అంచనాల్లో తలలు గోక్కుంటూ లెక్క లేసుకుంటున్నారు. అయితే ఇరువురికి విజయం నల్లేరుమీద నడక మాత్రం కాదు. 50 రోజుల పాటు ప్రచారాల్లో తలమునకలైన వివిధ పార్టీలు ఉపశమనం కోసం ఎవరికి అవకాశం ఉన్న చోటుకు వారు వెళ్లారు.కొందరు కేరళకు మరి కొందరు గోవాకు, ఇంకొందరు హైదరాబాదుకు తరలి వెళ్ళారు. 50రోజులు కష్టపడిన వారు సెదతీరుటకు విహార యాత్రలకు వెళ్ళారు. అయితే ఎవరి పరిధిలో వారు గెలుపుపై ఆశలు పెట్టుకున్నారు. మేము చేసిన అభివృద్ధి, అందించిన సహాయ సహకారాలు, అందుబాటులో ఉండటమే తమకు శ్రీరామరక్ష అని తప్పక గెలుస్తామని అధికార పార్టీ తరపున రెండవ సారి పోటీ చేసిన బియ్యపు మదుసూదనరెడ్డి ధీమాగా ఉన్నారు. గెలుపు అంచున ఉన్నామని అధికారికంగా జూన్ 4న ప్రకటించటమే తరువాయి అని భావిస్తున్నారు. అయితే ప్రజలు మార్పు కోరుకున్నారని యువత తమకు అండగా నిలిచారని, నిరుద్యోగులు, మైనారిటీలు తమకు అండగా నిలిచారని గ్రామాల్లో తమ బలం తగ్గలేదని ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలే తమకు శ్రీరామరక్ష అని తెలుగుదేశం అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ధీమాగా ఉన్నారు. గెలుపు ఎప్పుడో ఖాయమైందని అయితే ఎంత మెజారిటి అనేదే వేచి చూడాలని భావిస్తున్నారు.

**ఓట్ల లెక్కింపు ఇలా సాగుతుంది:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో శ్రీకాళహస్తి మండలం,అర్బన్, రేణిగుంట, ఏర్పేడు తొట్టంబేడు మండలాలు ఉన్నాయి. ఇక్కడ మొత్తం ఓటర్లు 2,48, 536 మంది కాగా ఇందులో మహిళలు 1,28,549, పురుషులు 1,19,973 మంది ఉన్నారు. ఈనెల 13నజరిగిన పోలింగ్‌లో మహిళలు 1,05,930 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా పురుషులు 1,00,982 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంటే ఈ నియోజకవర్గంలో పురుషుల కన్నా మహిళలు సుమారు5వేల మంది అధికాంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.దాంతో ఇరుపార్టీల అభ్యర్థులు మహిళలకు తమకు అండగా నిలిచారని ఎవరి పరిధిలో వారు విశ్లేషించుకుంటున్నారు. మరి మహిళలు ఎవరి పక్షాన మొగ్గు చూపారన్నది ప్రశ్నార్థకం.

**చివరి వరకూ ఉత్కంఠతే:**

శ్రీకాళహస్తి నియోజకవర్గ ఫలితాలు చివరి వరకు ఉత్కంఠతే అని చెప్పవచ్చు. ఓట్ల లెక్కింపుకు మొత్తం 14 టెబుల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 21 రౌండ్ల పాటు లెక్కింపు జరుగుతుంది. 8గంటలకు పోస్టల్ బ్యాలెట్స్‌ను లెక్కిస్తారు. తరువాత 8.30గంటలనుంచి ఈవిఎంలను లెక్కిస్తారు. మొదటి రౌండ్‌లో శ్రీకాళహస్తి మండలంలోని మన్నవరం నుంచి ప్రారంభిస్తారు. 46 పంచాతీల తరువాత పట్టణంలోని 35 వార్డులకు సంబంధించిన ఓట్లు లెక్కిస్తారు. తరువాత అత్యధిక ఓట్లున్న రేణిగుంట, ఆతరువాత ఏర్పేడు, చివరగా తొట్టంబేడు మండలం ఓట్లను లెక్కిస్తారు. మన్నవరం నుంచి ప్రారంభమైన ఓట్ల లెక్కింపు తొట్టంబేడు మండలంలోని బొనుపల్లితో ముగుస్తుంది. ఈ నేపధ్యంలో రాజకీయంగా ఎవరి అంచనాలు వారికుండగా చివరి వరకు ఫలితాలను అంచనావేయటం కష్టమే అని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. మరి ఏం జరుగుతుందో వేచి చూడాలి

## ఫీల్డ్ అసిస్టెంట్‌పై అవినీతి ఆరోపణలు!

**పనులకు వెళ్లపోయిన మస్టర్‌లో నమోదు-అకౌంట్ నుంచి బిల్లులు తీసిస్తే కమీషన్-ప్రశ్నిస్తే వారికి పనులు కల్పించడు-జాతర గొడవుల్లో వెలుగులోకి**




నారాయణవనం, మే 24 ప్రభాతవార్త : జీవనోపాధి కోసం పని అడిగే ప్రతి ఒక్క పేద కూలీకి జాతీయ గ్రామీణా ఉపాధి హామి పథకం ద్వారా పని కల్పించాలన్న ఉద్దేశ్యంతో 2006వ సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. అంతకు ముందు వరకు నిరుపేదలు స్థానికంగా పనులు దొరక్కపోతే వేరే ప్రాంతాలకు పనులకు వెళ్లి జీవనోపాధి పొందేవారు. దీన్ని గుర్తించిన కేంద్రంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జాతీయ ఉపాధి హామి పథకాన్ని తీసుకురావడంతో పేదలకు ఈ పథకం ఒక వరంగా మారింది. ఈ పథకం ద్వారా పనులు చేసుకుంటూ కుటుంబ పోషణను సాగిస్తున్నారు. అయితే ఈ పథకంలో పని చేసే కొంత మంది ఉద్యోగులు తప్పటడుగులు వేసి లక్షల రూపాయాలను అక్రమంగా సంపాదించి పోగు చేసుకుంటున్నారు. తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం నారాయణవనం మండలం బ్రాహ్మణాతాంగేల్ పంచాయతీ ఉపాధిహామి పథకంలో అంతులేని అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నది. ఇక్కడ ఉపాధిహామి పథకం ఫీల్డ్ అసిస్టెంట్ అయ్యప్ప కేవలం మూడు నుంచి నాలుగేళ్ల కాల పరిమితిలో లక్షల రూపాయాలను సంపాదించుకున్నాడనే ఆరోపణ గ్రామస్తులు వెల్లడిస్తున్నారు. ప్రతిరోజు కూలీలకు పనులు కల్పించే సాకుతో పనులకు రానీ కూలీల పేరును కూడా మస్టర్ రోల్‌లో నమోదు చేసుకొని ప్రతి నెల 50నుంచి 1లక్ష రూపాయాల వరకు సంపాదిస్తున్నట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వారం రోజుల క్రితం గ్రామంలో జరిగిన గంగమ్మ జాతరలో జరిగిన గొడవుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ అయ్యప్ప అవినీతి భాగోతాన్ని బయట పెట్టారు. ప్రతిరోజు ఉపాధి హామి పనులకు వెళ్లకపోయిన మస్టర్‌లో తమ చేత ఇంటి వద్దకు వచ్చిన సంతకాలు పెట్టించుకోవడం, జాబ్‌కార్డును కూడా తమకు ఇవ్వడని ఆరోపిస్తున్నారు. ప్రధానంగా గర్భవతులు, బాలింతలతో పాటు ఇతర ప్రాంతాల్లోని కంపెనీలు, కాలేజీల్లో పని చేసే కూలీలకు కూడా జాబ్‌కార్డులను మంజూరు చేయించి, పనికి రాకపోయిన మస్టర్‌లో పనులకు వచ్చినట్టు నమోదు చేసేవాడని, వారు జాబ్‌కార్డును అడిగితే మీకుందుకు ఇవ్వాలని, దాంతో మీకు ఏమి పని వుందని దౌర్జన్యం చేసేవాడని చెప్పారు. వాస్తవానికి ప్రతి శుక్రవారం ఉపాధి కూలీలతో సమావేశం జరిగిన తర్వాత జాబ్ కార్డులను కూలీలకు ఇవ్వాల్సి వుంటుంది. కానీ ఇక్కడ ఫీల్డ్ అసిస్టెంట్ మాత్రం తమకు ఇవ్వడని వాపోతున్నారు. ఉపాధిహామి బిల్లులు అకౌంట్‌లో పడిన వెంటనే తమను బ్యాంకులు, బిపిఒల వద్దకు తీసుకెళ్లి ఆ మొత్తాన్ని తీసుకొనేవాడని తెలిపారు. అందులో తమకు కొంతైనా డబ్బును ఇవ్వాలని అడిగితే ఈ డబ్బును మండల స్థాయిలో పని చేసే ఎపిఓ, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆఫరేటర్లకు ఇవ్వాలని చెప్పేవాడు. వాస్తవంగా కూలీ పనికి వెళ్లే వారు ఈ అక్రమాన్ని ప్రశ్నిస్తే వారిపై కక్ష కట్టడం, మరుసటి నెల నుంచి మూడు నెలల వరకు పనులు కల్పించేవాడుకాదన్నారు. ఇలా సుమారు మూడేళ్లుగా ఈ అక్రమాలు జరుగుతున్న ఏ ఒక్క అధికారి పట్టించుకోనేవారు కాదని చెబుతున్నారు. ఈ అక్రమాల్లో ఉన్నత అధికారులకు వాటా వుంటుందనే అనుమానాన్ని వ్యక్త పరుస్తున్నారు. బ్రాహ్మణాతాంగేల్ పంచాయతీలోని బ్రాహ్మణాతాంగేల్, వడ్డీల్లు గ్రామాల్లోనే ఎక్కువగా అక్రమాలు జరిగిందని చెబుతున్నారు. వెంటనే జిల్లా కలెక్టర్, డ్వామా అధికారులు వెంటనే స్పందించి విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. త్వరలో స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

**విచారణ జరిపి నిజ నిర్ధారణ తేలుస్తాం :**

ఉపాధి హామి ఎపిఓ సుఖన్య వివరణ ఇస్తూ...బ్రాహ్మణాతాంగేల్ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ అయ్యప్పపై వచ్చిన ఆరోపణ మేరకు విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎపిఓ సుఖన్య ప్రభాతవార్తకు వివరణ ఇచ్చారు.

## ఇస్రో కేంద్రాల వీక్షణతో... ముగిసిన యువికా 2024



యువికా విద్యార్థులతో వర్చువల్ ద్వారా మాట్లాడుతున్న ఇస్రో ఛైర్మన్ సోమనాథ్

శ్రీహరికోట (తడ), మే 24 ప్రభాతవార్త : శ్రీహరికోటలోని భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రంలో యువికా 2024 కార్యక్రమం ద్వారా వివిధ ఇస్రో పరిశోధన, ప్రయోగ కేంద్రాలను విద్యార్థులు వీక్షించారు. ఈ నెల 13న ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఇందులో భాగంగా శ్రీహరికోట కేంద్రానికి 51 మంది విద్యార్థులను కేటాయించారు. వీరిలో స్పేస్ సెంట్రల్ స్కూలు నుంచి ఒక విద్యార్థి ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, పశ్చిమబెంగాల్‌ల నుంచి పది మంది చొప్పున వచ్చారు. ఇందులో 25 మంది బాలికలు కాగా, 26 మంది బాలురు ఉన్నారు. వీరందరినీ స్థానిక శాస్త్రవేత్తలు, నిష్ణాతులు శాస్త్ర సాంకేతిక రంగాల వైపు మళ్లించేలా కార్యక్రమాలు చేపట్టారు. శ్రీహరికోటలో యోగా కార్యక్రమాలు సైతం నిర్వహించారు. షార్ డైరెక్టర్ రాజరాజన్‌తో పాటు వివిధ విభాగాల డిప్యూటీ డైరెక్టర్లు, సీనియర్ శాస్త్రవేత్తలు, అధికారులు కార్యక్రమంలో హుషార్‌గా పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ బెంగళూరులోని యుఆర్ఎస్‌సి నుంచి వర్చువల్ ద్వారా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమాలలో అంతరిక్ష ప్రయోగాల శిక్షణతో పాటు యోగా, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ వంటి విభాగాలలోనూ తర్ఫీదు ఇచ్చామని, విద్యార్థినీ విద్యార్థులు వారికి ఇష్టమైన చదువులను అభ్యసించడం కాకుండా భవిష్యత్‌లో దేశాభివృద్ధికి ఉపయోగపడాలని సోమనాథ్ పిలుపునిచ్చారు. సర్టిఫికెట్ల ప్రదానం అనంతరం రాజరాజన్ కూడా విద్యార్థులతో మాట్లాడి క్షేమంగా ఇళ్లకు తిరిగి వెళ్లేందుకు పలు ఏర్పాట్లు చేశారు.

## శిథిలావస్థలో బస్సుషెల్టర్లు



**పాలసముద్రం, మే 24 ప్రభాతవార్త:** బస్సు వచ్చే వరకు ప్రయాణీకులకు నీడ కల్పించాల్సిన బస్సు షెల్టర్లు పాలసముద్రం మండలంలో శిథిలావస్థకు చేరాయి. బస్సు షెల్టర్ల శిథిలావస్థకు చేరడంతో బస్సుల కోసం ఎదురు చూసే ప్రయాణీకులు రోడ్లపై బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి దాపురించింది. బస్సు షెల్టర్లలోకి వెళ్ళి కొద్దిసేపు కూర్చొందామని భావించినా ఆ బస్సు షెల్టర్లు ఎప్పుడు ఎవరిపై కూలుతుందోనని భయంతో ప్రయాణీకులు అటువైపు అడుగులు వేయలేని పరిస్థితి నెలకొంది. పాలసముద్రం బస్సు స్టాప్ పరిసరాల్లో ప్రయాణీకుల కోసం రెండు బస్సు స్టాపులు ఏర్పాటు చేశారు. పాలసముద్రం పోలీస్ స్టేషన్ ఎదురుగా ఒక బస్సు స్టాప్ ఏర్పాటు చేయగా గుండుబావికి సమీపంలో మరొక బస్సు స్టాపు ఏర్పాటు చేశారు. పాలసముద్రం పోలీస్ స్టేషన్ ఎదురుగా వున్న బస్సు స్టాప్ పరిస్థితి అయితే అగమ్యగోచరంగా కన్పిస్తుంది. ఈ బస్సు స్టాపు గోడలు బీటలు వారి కూలే విధంగా వుండటంతో ప్రయాణీకులు బస్సు స్టాపులోనికి వెళ్ళడానికి భయపడే పరిస్థితి ఏర్పడింది. అలాగే గుండుబావికి సమీపంలోని బస్ షెల్టర్ ప్రమాదకరంగా మారింది. మండల పరిధిలో విధులు నిర్వర్తించే అన్ని శాఖల అధికారులు అనునిత్యం ఇటువైపు నుండి రాకపోకలు సాగిస్తున్నప్పటికీ ఈ బస్ షెల్టర్ల గురించి పట్టించుకొన్నది లేదు. అలాగే రాజకీయ పార్టీల నేతలు సైతం ఈ బస్సు షెల్టర్లను నిర్లక్ష్యం చేయడంతో వీటికి ఈ దుస్థితి ఏర్పడింది. ఇకనైనా అధికారులు, రాజకీయ పార్టీల నేతలు ప్రజల సౌకర్యార్థం బస్సు షెల్టర్లను ఆధునకరించడానికి చర్యలు తీసుకొంటారని ఆశిద్దాం.

## ఓట్ల లెక్కింపుకు ఐదుగురు పరిశీలకులు నియామకం

**చిత్తూరు, మే 24 ప్రభాతవార్త:** సార్వత్రికి ఎన్నికలు-2024 ఓట్ల లెక్కింపుకు ఎలక్షన్ కమీషన్ జిల్లాకు ఐదు మంది పరిశీలకులను నియమించించింది. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు పరిశీకులుగా ఎండి షాదీక్ ఆలం, పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు పరిశీలకులుగా కవిత ఎస్.మన్నికేరీ, పలమనేరు, కుప్పం అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు పరిశీలకులుగా డాక్టర్ బికె మమతా, నగిరి అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు పరిశీలకులుగా డాక్టర్ భరత్‌భూషణ్, గంగాధరనెల్లూరు(ఎస్సీ), పూతలపట్టు(ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు పరిశీలకులుగా అభౌరి శశాంక్ సిన్హాలను ఎలక్షన్ కమీషన్ నియమించింది.

## కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



**పాలసముద్రం, మే 24 ప్రభాతవార్త:** ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎక్కడైనా ఎవరైనా ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ భారతి స్పష్టం చేశారు. బలిజకండిగ దళితవాడలో ఎస్ఐ భారతి గ్రామస్తులతో శుక్రవారం సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ పోలింగ్ అనంతరం ఎక్కడా ఎలాంటి ఘర్షణలు లేకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ రోజు ఎవరికైనా మనస్పర్థలు వచ్చివుంటే అది అప్పటికప్పుడు మరచిపోవాలని, దానిని సాగదీసి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎక్కడా బానా సంచా పేల్చరాదని, విక్రయాలు జరుపడానికి నిర్వాహకులు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. 4వ తేదీ ఓట్ల లెక్కింపు అనంతరం సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదని స్పష్టం చేశారు.

## 'దేశం' ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళను కలిసిన సూరిరెడ్డి

**శ్రీరంగరాజపురం, మే 24 ప్రభాతవార్త:** చిత్తూరు పార్లమెంటు తెలుగుదేశం అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావును శుక్రవారం చిత్తూరులోని ఆయన కార్యాలయంలో కొత్తపల్లిమిట్టకు చెందిన సూరిరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా సూరిరెడ్డి ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావును శాలువతో సత్కరించి ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజార్టీతో విజయం సాధిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేశం నాయకులు నవీన్‌రెడ్డి, అజిత్‌రెడ్డి, సాయికిరణ్, మదన్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్ సబ్సిడీ వేరుశనగ విత్తనాలను తనిఖీ చేసిన ఏడిఏ

గంగాధర నెల్లూరు మే 24 ప్రభాత వార్త :



ఖరీఫ్ సీజన్ కు వేరుశనగ విత్తనాల పంపిణీ శుక్రవారం నగరి అసిస్టెంట్ డైరెక్టర్ అగ్రికల్చర్ అధికారిని సైభాగ్య లక్ష్మి తనిఖీలు నిర్వహించారు. వేరుశనగ విత్తనాలు 30 కేజీలు బస్తా 2850కాగా దీనిలో 1140 సబ్సిడీ పోగా1710 రూపాయిలు చెల్లించాలని ఆమె తెలిపారు. ఇప్పటి వరకు 3596 మంది రైతులరు 1488 క్వింటాల విత్తనాలను పంపిణీ చేసాం అన్నారు. అలగే ప్రతి రైతుకు తమ ఆధార్ కార్డు తీసుకొచ్చి రైతుకు బస్తా చొప్పున పంపిణీ చేస్తున్నామని తేలిపారు.వీరు వేల్కూరు,కోట్రకోన, గంగాధార నెల్లూరు ఆర్బికేల లో పంపిణీని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఏ ఓలు స్వాతి, యామిని,చక్రవర్తి,సుభాహిని, తదితరులు పాల్గొన్నారు.

## బాటిల్స్‌కు పెట్రోల్ అమ్మకాలు చేయకూడదు

వెదురుకుప్పం, మే 24 ప్రభాతవార్త :



సార్వత్రిక ఎన్నికల నేపధ్యంలో ఎన్నికల కోడ్ అమలు ఉన్నంతవరకు పెట్రోల్ బంకులు, చిల్లర, చిన్న చిన్న దుకాణాలలో బాటిల్స్‌తో పెట్రోల్, డీజిల్ విక్రయలు చేయకుడదని మండల ఇవోపిఆర్‌డి పురుషోత్తం చిల్లర దుకాణాలకు, పెట్రోల్ బంకులకు శుక్రవారం నోటీసులు జారీచేశారు. మండలకేంద్రం,పచ్చికాపల్లంలోగల పెట్రోల్ బంకు యాజమానులకు ఈ మేరకు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. విధిగా బంకుల్లో వాహనాలకు మాత్రమే పెట్రోలు, డీజిల్ అమ్మకాలు చేయవలసి ఉందని తెలిపిన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సుబ్రమణ్యం, నాగరాజు, యంఎస్‌కె ఢిల్లీ శిరీష తదితరులు పాల్గొన్నారు.

## కత్తితో బెదిరించి ఐక్రీమ్ డబ్బాలు పట్టుకెళ్లారు!

కుప్పం, మే 24 ప్రభాతవార్త :



ఇది వినడానికి కాస్త నవ్వు తెప్పించినా నిజమే. ఐస్ క్రీమ్‌లు విక్రయించే దుకాణ దారుడ్ని కత్తితో బెదిరి ంచి అతని వద్ద నుంచి సుమారు నాలుగువేల రూపాయల విలువ చేసే ఐస్‌క్రీములను గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకెళ్లిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈమేరకు బాధితుడు కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం మేరకు వివరాలిలా.. కుప్పం పట్టణం హెచ్‌పి రోడ్‌లో మణికంఠ అనే వ్యక్తి ఐస్‌క్రీమ్ షాప్ నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి శ్రీ తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా కొంతమంది యువకులు అతని అంగడి వద్దకు చేరుకున్నారు. అక్కడే కొన్ని ఐస్ క్రీములు తిని మరి కొన్ని తమ వెంట తీసుకెళ్లే ప్రయత్నం చేయగా అంతలో యజమాని మణికంఠ డబ్బులు అడిగాడని దీంతో ఆ గుర్తు తెలియని వ్యక్తుల్లో ఓ యువకుడు తన వద్ద ఉన్న కత్తి తీసి మా వద్దే డబ్బులు అడుగుతావా అంటూ కత్తి చూపి ంచి బెదిరించాడు. దీంతో ఒక్కసారిగా మణికంఠ షాక్‌కు గురి కాగా అంతలోనే సుమారు నాలుగు వేల రూపాయల విలువ చేసే ఐస్ క్రీడ్ డబ్బాలతో ఆ యువకులు అక్కడనుంచి ఉడాయించారు. ఈ వ్యవహారం సిసి కెమెరాల్లో సైతం రికార్డు అయి ఉంది. చేసేది లేక బాధితుడు మణికంఠ కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## ఘనంగా మహాభారత ఉత్సవాలు

కుప్పం, మే 24 ప్రభాతవార్త :



గుడుపల్లె మండలం యామిగానిపల్లిలో శ్రీ మహాభారత ఉత్సవాలు ఘన ంగా జరుగుతున్నాయి. శుక్రవారం అర్జునుడు తపస్సు మాను అధిరోహించే ఘట్టాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అర్జున పాత్ర ధారి తపస్సు మాను ఎక్కిన అనంతరం పెద్ద ఎత్తున నిమ్మ కాయలను కిందకు చల్లారు. వీటిని పొందేందుకు భక్తులు ఉత్సాహం చూపారు. ఈ మహాభారత ఉత్సవాలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## కడపల్లి మాజీ సర్పంచ్ మృతి...దేశం నేతల సంతాపం

శాంతిపురం, మే 24 ప్రభాతవార్త :

మండలంలోని కడపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ పోడూరుకు చెందిన పురుషోత్తం మృతి చెందాడు. ఈయన గతకొ ంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం అక్కడే మృతి చెందాడు. ఈసందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయం వద్ద దేశం నేతలు పురుషోత్తం చిత్రపటానికి నివాళులు అర్పించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఎమ్మెల్సీ,సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్, నాగరాజు, రమేష్, అనసూయ, చంద్రకళ, సుగుణమ్మ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

## దివ్యాంగ బాలికల హాస్టల్ ప్రవేశానికి దరఖాస్తులు

చిత్తూరు, మే 24 ప్రభాతవార్త:

విభిన్న ప్రతిభావంతుల బాలికల హాస్టల్‌లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఎవై శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చిత్తూరు నగర పరిధిలో రెడ్డిగుంట సమీపంలోని డిఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదురుగా వున్న విభిన్న ప్రతిభావంతుల బాలికల హాస్టల్‌లో 1 నుండి ఇంటర్మీడియేట్ ఆపై చదువుతన్న విభిన్న ప్రతిభావంతులైన బాలికలకు ప్రవేశం కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే పూర్తి వివరాల కోసం 9440990698 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## దుకాణాలలో అక్రమ పెట్రోలు,డీజిలు స్వాధీనం

పుంగనూరు,మే 24 ప్రభాతవార్త :



మండలంలోని సుగాలిమిట్ట,వెంకటాద్రిపురం గ్రామాలలో ఎటువంటి అనుమతి లేకుండా అక్రమంగా పెట్రోలు,డీజిలు విక్రయిస్తున్న దుకాణాలపై తహసీల్దార్, కార్యాలయ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా పలు దుకాణాలలో లీటరు పెట్రోలు రూ.130 నుంచి రూ.140 వరకు విక్రయిస్తున్నారని,ముందుగానే లీటరు, అర్ధలీటరు బాటిళ్ళలో పెట్రోలు పోసి ఉంచి విక్రయిస్తున్నట్లు స్థానికులు ఈసందర్భంగా ఫిర్యాదు చేశారు. దీనికి తోడు డీజిల్‌ను కూడా లారీలకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలియడంతో అధికారులు దాడులు నిర్వహించారు. పెట్రోలు,డీజిలు ప్రభుత్వం అనుమతి, లైసెన్స్‌లేనిదే ఎవరూ విక్రయించరాదని తెలిపారు. ఇప్పటికి విక్రయదారులకు హెచ్చరికలతో వదిలేస్తున్నామని, ఇదే విషయం పునరావృతమైతే కేసులు తప్పవని హెచ్చరించారు.

## ఢిల్లీ రోడ్డు ప్రమాదంలో చౌడేపల్లి యువకుడి మృతి

చౌడేపల్లి, మే 24 ప్రభాతవార్త :



దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చౌడేపల్లికి చెందిన యువకుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు...మడల కేంద్రమైన చౌడేపల్లి హైస్కూల్ వీధికి చెందిన పగడాల రవి, భవానీ దంపతుల కుమారుడు హర్షల్(22)ఉన్నత విద్యకోసం ఢిల్లీకి వెళ్ళాడు. అక్కడ ఎంబిఏ పూర్తి చేశాడు. మరో రెండు రోజుల్లో స్వస్థలానికి రావాల్సివుంది. ఈక్రమంలో గత 3రోజుల క్రితం ఢిల్లీలో రోడ్డు దాటుతుండగా కారు ఢీకొన్నది. ఈప్రమాదంలో హర్షల్ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని ఎయిమ్స్ ఆసుపత్రిలోచేర్పించి చికిత్స చేయిం చారు.చికిత్సపొందుతూ యువకుడుశుక్రవారం ఉదయంమృతి చెందాడు.

**చలాకీ హర్షల్ :** చిన్నతనం నుంచి హర్షల్ చలాకీగా ఉండేవాడు. పగడాల రవి, భవానీల ఏకైక సంతానమైన హర్షల్(పండు)ను అల్లారు ముద్దుగా పెంచారు. డాన్సులు, అధ్యాత్మిక చింతన హర్షల్‌కు మక్కువ వుండేది. చాలా వరకు స్టేజీ నృత్యాలేసి బాల్యం నుంచి అందరి మన్నలను పొందాడు. ప్రముఖ డాన్సర్లను సైతం మెప్పించి అవార్డులందుకొన్నాడు. అలాంటి యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్న వార్త సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో చౌడేపల్లిలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకొన్నాయి. చేతికందే సమయంలో ఒక్కగానొక్క కుమారుడిని ఆ కుటుంబం కోల్పోయింది. కాగా అవయవదానం చేసి తల్లిదండ్రులు మానవత్వానికి చాటుకొన్నారు.

## గంగమ్మకు రాహుకాలాభిషేకం

బోయకొండ(చౌడేపల్లి), మే 24 ప్రభాతవార్త :



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు శుక్రవారం రాహుకాలా భిషేకం నిర్వహించారు. ఉదయాన్నే వేద పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, విశేషాలంకరణ గావించారు. అనంతరం రాహుకాల సమయంలో దంపతుల సమక్షంలో రాహు కాలాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాత కళ్యాణకట్ట వద్ద ఉచిత అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. ఛేర్మన్ నాగరాజరెడ్డి, ఇఓ చంద్రమౌళి, అధికార, సిబ్బంది సేవలందించారు.

## టపాకాయలు విక్రయించరాదు పేల్చరాదు

చౌడేపల్లి, మే 24 ప్రభాతవార్త :



టపాకాయలను విక్రయించరాదు, పేల్చరాదని తహశీల్దార్ రాయుడు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పరిపాలనా భవనంలో టపాకాయలు దుకాణదారులతో సమావేశం జరిగింది. ఎన్నికల నియమావళి అమలులో వున్నందున ర్యాలీలు, సభలు నిర్వహించరాదన్నారు. పెట్రోల్ బంకుల్లో బాటిళ్ళలో విక్రయించరాదన్నారు. ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకొంటామన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పశువులుకు మేత లేక కసాయికి అమ్ముకొంటున్నా అన్నాదాతలు!

వెంకటగిరి మే 24,ప్రభాతవార్త:



భానుడు అగ్ని గుండంగా మారడంతో పచ్చని పోలాలల్లో సైతం పచ్చిక ఎండిపోవడంతో పాడి గెదలకు, పశవులకు మేత మేసేందుకు మేత లేక త్రాగేందుకు చేరువుల్లో గుంటలల్లో నీరు లేక పోవడంతో గేదలను కాపడుకోనే పరిస్థితులు ఏర్పడాయి. మద్రాస్ తదితర ప్రాంతలకు చెందిన కసాయి వ్యారులకు గేదలను సగం ధరలకే అమ్ముకోనే దుస్థితి నెలకొని ఉందని గ్రామీణ ప్రాంతల పశువులు యజామానులు,పాడిపరిశ్రమ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని పల్లెల్లో మనుషులు త్రాగేందు కోసమే నీరు లేక పోవడంతో పశువులను నీరు పెట్టలన్నా, మేత కష్టంగా మారడంతో కసాయికి తేగనమ్మేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.గతంలో గ్రామీణ ప్రాంతలల్లో పశువులకు త్రాగునీరు కోసం ప్రత్యేక తొట్టెలు ప్రభుత్వం ఎర్పాటు చేశారు. అయితే గ్రామీణ ప్రాంతలల్లో అవి పూర్తి శిధిలావస్థకు చేరడంతో పశువులను కాపడుకోవలవంటే వాటికి మేత, నీరు అందించడం ఇబ్బందిగా మారడంతో దిక్కు తోచని స్థితిలో కసాయకి అమ్ముకోక తప్పడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రమణయ్య అంత్యక్రియలు నిర్వహించిన మెగా అభిమానులు

గూడూరు, మే 24 ప్రభాతవార్త :



గూడూరు పట్టణంలోని ఓం శ్రీ సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో రమణయ్య (85) అనే వృద్ధుడు ఆశ్రయం పొందుతున్నాడు. ఈ క్రమంలో రమణయ్య అనారోగ్యానికి గురై శుక్రవారం ఉదయం మృతి చెందారు. అతనికి సంబంధించిన వారు ఎవరు లేకపోవడంతో వృద్ధాశ్రమం నిర్వాహకురాలు కళ్యాణి, మెగా బ్రదర్స్ సేవా సమితి సభ్యులకు రమణయ్య మృతి చెందిన విషయాన్ని తెలిపారు. దీంతో మెగా బ్రదర్స్ సేవాసమితి సభ్యులు, జనసైనికులు ఓంకార్, మోహన్, విజయ్, సనత్, వెంకటేష్, సుబ్బయ్యలు వృద్ధాశ్రమంకు చేరుకొని రమణయ్య మృతదేహాన్ని హిందూ సాంప్రదాయం ప్రకారం గూడూరు సాదుపేట సెంటర్‌లో వున్న స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

## వైద్యం పట్ల ఎంత అంకితభావం అవసరం



గూడూరు, మే 24 ప్రభాతవార్త :

గూడూరు పట్టణ పరిసర ప్రాంత ప్రజలకు పేదల పెన్నిధిగా సేవలందిస్తున్న డాక్టర్ రోహిణమ్మకి ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం శాలువా కప్పి పుష్ప గుచ్ఛాన్ని అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ వైద్యం పట్ల ఎంత అంకితభావంతో ఉంటారో అదే అంకితభావంతో ఇన్నర్ వీల్ క్లబ్, స్వచ్ఛంద సేవా సంస్థలకు తోడ్పాటు అందించడంలోనూ ముందుంటారని పేర్కొన్నారు. డాక్టర్ రోహిణమ్మ సేవలను మానవతా దృక్పధాన్ని ఎన్నటికి మరువలేమని కొనియాడారు. భవిష్యత్తులో మరెన్నో పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## హౌసింగ్‌పై సమీక్ష సమావేశం

వాకాడు, మే 24 ప్రభాతవార్త :



మండల పరిషత్ కార్యాలయం లోని ఎంపిడిఓ వెంకటేశ్వర ఆధ్వర్యంలో శుక్ర వారం హౌసింగ్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు మాట్లాడు తూ మండలంలోని సార్వత్రిక ఎన్నికల అనంతరం హౌసింగ్ నిర్మాణం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇప్పటికే ఆగి ఉన్న గ్రామీణ, జగనన్న లేఔట్‌లో గృహాలు లబ్ధిదారుల చేత నిర్మాణాలు చేపట్టాలని హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు సిబ్బందికి సూచించారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఇప్పటి నుండే పక్క గృహాలుకు వివిధ దశలో వున్నా వాటిని నిర్మాణం జరిగేలాగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ ఉన్నారు.

## 30న సర్వసభ సమావేశం



వాకాడు, మే 24 ప్రభాతవార్త :

ఈ నెల 30వ తేదిన మండల సర్వసభ సమావేశం మండల పరిషత్ కార్యాలయంలోని జరుగుతుందని ఎంపిడిఓ కార్యాలయంలోని జరుగు తుందని ఎంపిడిఓ వెంకటేశ్వరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎంపిపి అనసూయ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన సప్లమెంటరీ పరీక్షలు

వెంకటగిరి టౌన్, మే 24 ప్రభాతవార్త :



ఇంటర్మీడియట్, పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జడ్పి బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు విద్యా సంవత్సరం వృదా కాకుండా సప్లిమెంట్ పరీక్షల్లో పాసై ఇంటర్‌లో చేరేందుకు ఈ పరీక్షలు ఉపయోగపడతాయి.

## కోటమ్మ ఆలయంలో అన్నదానం

కోట, మే 24 ప్రభాతవార్త :



దువ్వూరు సుజాతమ్మ జ్ఞాపకార్థం శుక్రవారం కోటమ్మ ఆలయంలో దువ్వూరు నగేష్‌రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, కవితమ్మల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వందలాది మంది భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో షిరిడి సాయి అక్షయ సేవాసమితి కన్వీనర్ అల్లం రమణయ్య, శ్రీరామ్ సుధాకర్, వేలాంగిణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తడలో పోలీసు దళాల కవాతు

తడ, మే 24 ప్రభాతవార్త :



వచ్చే నెల 4న జరిగే సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముం దస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సమస్యా త్మక గ్రామాలపై వీరు దృష్టి పెట్టారు. తడ, తడకండ్రి గలలో శుక్రవారం సాయంత్రం పోలీసులు కవాతు చేపట్టారు. స్థానికులకు, ఓటర్లకు తాము రక్షణ కల్పిస్తామని, ఎవరూ ఎటువంటి వివాదాలకు చోటివ్వకుండా ఎన్నికల నిబంధనలు పాటించాలని చెప్పారు. ఇదిలావుంటే ఇంతకుముందే వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కూడా పోలీసులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. సూళ్లూరుపేట సిఐ మధుబాబు, తడ, సూళ్లూరుపేట ఎస్ఐలు నరసింహారావు, రహీమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదంలో యువకుడు దుర్మరణం!

దొరవారిసత్రం మే 24 ప్రభాతవార్త ;

మండలంలోని వెదురుపట్టురోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో పునబాక నవీన్(20) అనే యువకుడు దుర్మరణం చెందాడు.పోలీసుల సమాచ్చారం మెరకు వివరాలిలా ఉన్నాయి.యేకొల్లు గ్రామానికి చెందిన పునబాక నవీన్ తన స్నేహితుడు పుట్టినరోజు వేడుకలకు మోటార్‌సైకిల్‌పై కోటపోలూరుకు వెళ్ళి తిరిగి స్వగ్రామమైన యేకొల్లుకు వస్తుండగా మార్గమధ్యలో వెదురుపట్టురోడ్డు వద్దకు వచ్చేసరికి వెనుక నుండి అదేమార్గంలో వస్తున్న గుర్తుతెలియని వాహనం ప్రమాధవశాత్తు డీకొంది.దీంతో నవీన్ అక్కడికక్కడే మృతిచెందాడు.విషయం తెలుసుకొన్న దొరవారిసత్రం ఎస్సై తిరుమలరావు తనసిబ్బందితో కలిసి ప్రమాధం జరిగిన ప్రదేశాన్ని మృతదేహాన్ని పరిశీలించారు.అనంతరం పంచనామ నిమిత్తం మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరళించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలియజేశారు.

## పురుగుల మందుతాగి వృద్ధుడు మృతి!

దొరవారిసత్రం మే 24 ప్రభాతవార్త ;

మండలంలోని ఆర్మేనికండ్రిగ గ్రామానికి చెందిన మద్దూరు రాగయ్య(74)అనే వృద్ధుడు పురుగుల మందు తాగి శుక్రవారం మృతిచెందాడు.పోలీసుల సమాచ్చారం మెరకు వివరాలిలా ఉన్నాయి. ఆర్మేనికండ్రిగ గ్రామంలో నివాసం ఉంటున్న రాగయ్య కుటుంబ కలహాలు కారణంగా మనస్థాపం చెంది పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడాడు.విషయం తెలుసుకొన్న కుటుంబ సభ్యులు రాగయ్యను 108సహాయంతో సూళ్ళూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరళించేసరికి ఆయన మృతిచెందినట్లు వైధ్యులు తెలిపారు. ఆయన బార్య,ఇద్దరు కుమారులు ఉన్నారు.దొరవారిసత్రం ఎస్సై తిరుమలరావు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 70 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

పలమనేరు టౌన్, మే 24 ప్రభాతవార్త:



పలమనేరు ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో 70 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడం జరిగిందని ప్రిన్సిపల్ డా.మహమూద్ తెలిపారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతూ విస్ట్రాన్,ఆవిజా కంపెనీలు నిర్వహించిన ప్రంగణ ఉద్యోగ ఎంపికలో 70 మంది విద్యార్థులు ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. ఈ మేరకు స్థానిక కళాశాలలో శుక్రవారం జాబ్ అచీవర్స్ డే సందర్భంగా నిర్వహించిన కార్యాక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్డీఓ మనోజ్‌రెడ్డి ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు సాయిలక్ష్మిప్రసన్న, డా.శ్రీవిద్య, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డా.జయపాల్,సీనియర్ అధ్యాపకులు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీవెంకటేశ్వరస్వామి వారి కల్యాణం

సదుం,మే24 ప్రభాతవార్త :

బూరగమంద గ్రామంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణానికి గాను జిల్లా వ్యవసాయశాఖ సలహా మండలి సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి పట్టువస్త్రాలను సమర్పించారు.అనంతరం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారికి అర్చకులు విష్ణుకాంత్ బట్టర్, శేషగిరిల ఆధ్వర్యంలో వివాహ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం పౌర్ణమి సందర్భంగా గరుడవాహన సేవ నిర్వహించారు.ఈసందర్భంగా ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. తితిదేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆలయం చుట్టు పక్కల వేసిన వివిధ రకాల విద్యుత్ దీపాలంకరనలు భక్తులను అలరించాయి.కార్యక్రమాలలో తితిదే సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, అటెండర్ సిద్దారెడ్డి, సర్పంచి వెంకటరమణ, మాజీ సర్పంచి వెంకటరెడ్డి, యండపల్లె మనోహరరెడ్డి, ప్రభాకరరెడ్డి, వెంకటరెడ్డి, శ్రీరాములు,కృష్ణయ్య,దామోదరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పోలీసుల కేసు నమోదుతో...ఫోర్జరీ న్యాయవాది పరారీ!

గంగవరం, మే 24, ప్రభాతవార్త :

ఓ మహిళ వద్ద రూ.500 అడ్వాన్స్ ఇచ్చి రూ.5 కోట్లు విలువ చేసే భూమిని కాజేసిన హైకోర్టు న్యాయవాది గోవర్ధన్‌రెడ్డిపై గంగవరం పోలీసులు కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న సదరు న్యాయవాది పరారీలో ఉన్నాడు.గంగవరం అర్బన్ సిఐ చిన్న గోవిందు కథనం మేరకు వివరాలిలా.. మండలంలోని గంగవరం పంచాయతీ రొంటకుంట్ల గ్రామానికి చెందిన ఆంజనేయప్ప,చెళ్ళమ్మ దంపతులకు గంగవరం రెవెన్యూ పరిధిలోని సర్వే 358/1లో 3.54 ఎకరాల వ్యవసాయ భూమి కలదు. ఆంజనేయప్ప, చెళ్ళమ్మలకు నలుగురు కుమార్తెలు సంతానం. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు మృతి చెందడంతో వారి పేరుపై ఉన్న వ్యవసాయ భూమిని విక్రయించడానికి కుమార్తెలు రమాదేవి, లక్ష్మీదేవమ్మ, ప్రమీలమ్మ,కళావతిలు నిర్ణయించుకున్నారు. దీంతో హైకోర్టు న్యాయవాది గోవర్ధన్‌రెడ్డితో పాటు దళారులైన దిలీప్‌కుమార్, సంతోష్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్, నయాజ్, డాక్యుమెంట్ రైటర్ సుబ్రమణ్యంలను సంప్రదించారు. ఇదే అదునుగా భావించినఅక్రమార్కులు అమయక మహిళలను మోసగించి ఎలాగైనా కోట్ల విలువ చేసే భూమిని కాజేయాలనే కుట్ర పన్నారు.సదరు భూమి సంబంధించిన పత్రాలను తీసుకొని, మహిళల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ పత్రాలను సృష్టించడంతో పాటు సదరు భూమిని ఏడాది క్రితం సదుం మండలం యర్రాతివారిపల్లె గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి కుమారుడు గోవర్ధన్‌రెడ్డికి రూ.25 లక్షలకు విక్రయించినట్లు అగ్రిమెంట్ చేసుకొని,తమకు రూ.పది లక్షలు ఇచ్చినట్లు పోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి కోర్టులో వారిపై కేసు వేసి నోటీసులు పంపడంతో బాధిత మహిళలు దిక్కుతోచక లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించడంతో బాధితుల ఫిర్యాదు మేరకు సిఐ చిన్నగోవిందు నిందితులు ఆరుగురుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.విషయం తెలుసుకున్న న్యాయవాదితో సహా నిందితులు పరారీలో ఉన్నారని,నిందితుల కోసం గాలిస్తున్నట్లు సిఐ పేర్కొన్నారు.

## కుమారస్వామి కొండపై పనులను వేగవంతం చేయండి: చైర్మన్

శ్రీకాళహస్తి, మే 23 ప్రభాతవార్త :




కుమారస్వామి కొండ వద్ద వెలసిన విఘ్నాలకు అధిపతి అయిన విఘ్నేశ్వరుని మండపాన్ని పరిశీలించిన శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ చైర్మన్ అంజూరుతారకశ్రీనివావాసులు పరిశీలించి పనులు సత్వరం పూర్తిచేశాయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సుబ్రమణ్యేశ్వరస్వామి కొండకొంద రూ.10లక్షలతో విఘ్నేశ్వరుని నూతన మండపాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సభ్యులు ఆవుల శ్రీనివాసులు, ప్రత్యేక ఆహ్వానితులు కంటా ఉదయ్‌కుమార్, ఇంజనీరింగ్ శాఖ డిఈఈ శ్రీనివాసులురెడ్డి, ఎఈ వేణుగోపాల్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, కాంటాక్టర్ గుమ్మడిబాలకృష్ణయ్య, మరియు దేవస్థాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బృందమ్మ కాలనీలో పోలీసుల ఆకస్మిక నాకాబందీ

తొట్టంబేడు, మే 24 ప్రభాతవార్త :



పట్టణంలోని బృందమ్మ కాలనీలో డిఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక నాకాబందీ నిర్వహిం చారు. ఇందులో భాగంగా డిఎస్పీతో పాటు అర్బన్ సిఐ నరసింహారావు, టుటౌన్ సిఐ రారాజు, ఎస్ఐలు 5మంది, 35మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కాలనీలో అనువనువుగా తనిఖీలు చేశారు. సరైన రికార్డులు లేని ఐదు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. కాలనీలో సమావేశం నఇర్వహించి ఎన్నికల నియమావళి అమలులో ఉందని దీన్ని అందరు పాటించాలని తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ రోజున ఎలాంటి ఘర్షణలకు, ర్యాలీలు ఉండరాదని తెలిపారు.

## ఓట్ల లెక్కింపు సందర్భంగా ప్రత్యేక కార్యాచరణ..డిఎస్పీ

–సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్‌ఫికెట్లు

తొట్టంబేడు, మే 24 ప్రభాతవార్త :



ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తిరుపతి జిల్లా పోలీసులు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని డిఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల తిరుపతి జిల్లాలో జరిగిన సాధారణ ఎన్నికల్లో కొన్ని చోట్లు అవాంఛనీయ సంఘటనలు జరిగిన దృష్ట్యా రాబోవు జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా పోలీసులు తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అందులో పోలీసు ఫికెట్లును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని పార్టీల నాయకులు పోలీసు వారికి సహకరించి ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా ముగించేందుకు సహరించాలని విజ్ఞప్తిచేశారు

## గుర్తు తెలియని వ్యక్తి మృతి!

తొట్టంబేడు, మే 24 ప్రభాతవార్త :



మండలంలోని రామచంద్రాపురం వద్ద వడదెబ్బకు ఓవ్యక్తి మృతిచెందినట్లు టుటౌన్ సిఐ రారాజు తెలిపారు. మృతుని వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉంటుందనిఎవరైనా ఇతన్ని గుర్తు పట్టిన ఎడల రెండ పట్టణ సిఐ రారాజు 94409 00008కు సమాచారం అందించాలని కోరారు.

## మనం మహామ్మద్ ప్రవక్త సంతతని చెప్పుకుంటాం కానీ!

శ్రీకాళహస్తి,మే 24 ప్రభాతవార్త :



సమాజంలో మనం మహామ్మద్ ప్రవక్త సంతతని చెప్పుకుంటున్నాము కానీ ఆయన ఆశయాలు,ఆదర్శాలు, ఆయన అనుసరించిన విధి విధానాలను మనం ఆచరిస్తున్నామా? అని హాపీజే ఖుర్ఆన్ రేహాన్ అన్నారు. శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల తరువాత రేహాన్ ముస్లింలు అనుసరించిన విధి విధానాలను వివరించారు. మసీదులో అనుసరించాల్సిన అంశాలకు సంబంధించి వివరిస్తూ వరుసలో నిలబడినపుడు భుజానికి భుజం ఆనించి నిలబడాలని అలాగే కాళ్ళ మిడిమిలు కలసి ఉండాలని సూచించారు. అంతేకాక నేలమీద కూర్చొగల్గిన వారు కుర్చిల్లో కూర్చొంటే నమాజు ఆమోదించబడదన్నారు. ప్రతి ఒక్కరు కొన్ని సూత్రాలను పాటించాలని సూచించారు. ఇక మహమ్మద్ ప్రవక్త మితాహారం తీసుకునే వారని నేడు మనం ఆచరిస్తున్న విధానాలేమిటో ఒక సారి పరిశీలించుకోవాలన్నారు. కుటుంబంలో సఖ్యత, సయోధ్య, ప్రేమానురాగాలను నేర్పుతుందన్నారు. ఇక ఇంటిలో ప్రవేశిస్తేనే చిరునవ్వుతో కుటుంబ సభ్యులను పలకరించాలన్నారు.

## యానాదుల పేరుతో భూ కబ్జాలపై విచారణ జరపాలి

శ్రీకాళహస్తి,మే 24 ప్రభాతవార్త :

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో యానాదుల పేరుతో విచ్చల విడిగా భూ కబ్జాలు జరుగుతున్నాయని రెవెన్యూ అధికారులు స్పందించి విచారణ జరపాలని దళిత నేత రమేష్ జిల్లా అధికారులకు పిర్యాదు చేసారు.ఈమేరకు ఆయన పత్రికల వారితో మాట్లాడుతూ యానాదులకు సంబంధించిన వ్యక్తి కాకపోయినా యానాది సంఘం అధ్యక్షులుగా చెలామణి అవుతున్న చందమామల కోటయ్య యానాదుల పేరుతో విచ్చల విడిగా భూ కబ్జాలకు పాల్పడుతూ యానాదులకు అన్యాయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని కొంత మంది యానాదులకు సంబంధించిన ఆధార్‌కార్డులను చిరునామాలు శ్రీకాళహస్తిలో ఉన్నట్లు మార్చి తమ పబ్బం గడుపుకుంటున్నారని రమేష్ ఆరోపించారు. స్థానిక అధికారులు ఎలాగూ పట్టించుకోరని కాబట్టి జిల్లా అధికారులు స్పందించి చందమామల కోటయ్యపై ఆయన కుల ధృవీకరణ పత్రాలపై, భూ కబ్జాలపై సమగ్ర విచారణ జరిపి యానాదులకు న్యాయం చేయాలని కోరారు.

## సిఎస్ జవహర్‌రెడ్డిని వెంటనే తప్పించండి

శ్రీకాళహస్తి, మే 24 ప్రభాతవార్త :



రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న అరాచక శక్తులకు కావాల్సినంత మద్దతు సమకూర్చుతూ రాజ్యాంగా స్ఫూర్తితో తుంగలో తొక్కిన సిఎస్ జవహర్‌రెడ్డిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తక్షణమే తప్పించాలని తెలుగుదేశంపార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్‌రావు, సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుబుజ్జిలు సంయుక్తంగా డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా సజావుగా జరిపించాల్సిన గురుతర భాధ్యత విస్మరించి కేవలం జగన్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేస్తున్న సిఎస్ ను తొలగించాలని డిమాండ్ చేశారు.జిలానీ, మునిరాజయాదవ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## అవాంచనీయ సంఘటనలు జరగకూడదు : డీఎస్పీ

పుత్తూరురూరల్, మే 24 ప్రభాతవార్త:



ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా తిరుపతి జిల్లా పోలీసులు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల తిరుపతి జిల్లాలో జరిగిన సాధారణ ఎన్నికల్లో కొన్ని చోట్ల అవాంచనీయ సంఘటనలు జరిగిన దృష్ట్యా రాబోయే జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా పోలీసులు తగిన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అందులో పోలీసు పికెట్లను ఏర్పాటు చేయడం జరిగిందని, అదే విధంగా ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసు మొబైల్ పార్టీలు, క్యూ ఆర్‌టీ టీంలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ట్రబుల్ మాంగర్లు, సంఘ విద్రోహ శక్తులను గుర్తించి, వారిపై ప్రత్యేకత నిఘా ఏర్పాటు చేయడమే కాకుండా వారి ప్రతి కదలిక గమనిస్తుంటామన్నారు. కౌంటింగ్ తరువాత కాని సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు నిషేధించడమైందని, పై నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## ఎన్నికల కోడ్ అమల్లో ఉంది... జాగ్రత్త

విజయోత్సవ ర్యాలీలు బంద్....రౌడీ షీటర్ల పై ప్రత్యేక నిఘా

సమస్యాత్మక ప్రాంతాలలో పీకెట్స్ ఏర్పాటు ...డిఎస్పి రవి మనోహరచారి వెల్లడి

తిరుపతి క్రైం, మే 24, ప్రభాతవార్త :



జూన్ 6 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉందని జాగ్రత్తగా మెలగాలని తిరుపతి డిఎస్పి రవి మనోహరచారి హెచ్చరించారు. శుక్రవారం ఎస్‌వి యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు హింసాత్మక పరిణామాలు చోటు చేసుకోకుండా శాంతి భద్రతలు కాపాడాలని ఆయన కోరారు. సమస్యాత్మక ప్రాంతాలలో పికెట్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడుతాయని గెలిచిన అభ్యర్థులు టపాసులు, బ్యాండ్ మేళాలు, సంబరాలు, డీజేలు, ర్యాలీలు నిశ్శబ్ధమని తెలిపారు. నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గెలిచిన అభ్యర్థులను పోలీస్ బందోబస్తుతో తమ ఇంటికి చేరుస్తామని అలాగే ఓడిన అభ్యర్థులు కూడా బందోబస్తు కల్పిస్తూ తమ ఇంటికి చేరుస్తామని తెలిపారు. ఎన్నికల కోడ్ తదుపరి పోలీస్ అనుమతి పొంది విజయోత్సవ ర్యాలీలు జరుపుకోవచ్చని తెలిపారు. రౌడీ షీటర్లునఉ బైండోవర్ చేస్తామని వారి తీరు మారకుంటే రోజు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఎన్నికల కౌంటింగ్ పూర్తి అయ్యేవరకు అదుపులో ఉంచుతామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు నాయకులు, కార్యకర్తలు సమన్వయం పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. శాంతి భద్రతలు ఆటంకం కలిగించిన వారి పైన కఠినమైన చర్యలు తీసుకుంటామని అవసరమైతే రౌడీ షీట్స్ కూడా పెడుతామని హెచ్చరించారు. నగరంలో 1వ తారీకు నుంచి 5వ తారీఖు వరకు తిరఉమల వచ్చే శ్రీ వారి భక్తులకు మినహా స్థానికులకు తిరుపతి, చిత్తూరు జిల్లా ప్రజలకు హోటల్లు లాడ్జీలు కల్యాణ మండపాలు ఫంక్షన్ హాల్లు అద్దెకు ఇవ్వకూడదని తెలిపారు. ఉత్తర్వులు అధికమిస్తే నిర్వాహకులపై కేసుల నమోదు చేస్తామని తెలిపారు. యజమానులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇస్తామన్నారు. నిజంగా వివాహములు, పుట్టినరోజులు ఉంటే ఆధారాలతో సంబంధిత పోలీస్ స్టేషన్ నందు అనుమతి పొంది కార్యక్రమం నిర్వహించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ మురళీమోహన్ రావు, ఎస్ఐ రామాంజనేయులు పాల్గొన్నారు.

## ప్రశాంత ఓటింగ్‌కు ముందే...తిరుమలలో పోలీసుల కార్డన్‌సెర్చ్

–15 ద్విచక్రవాహనాలు సీజ్

తిరుమల,మే 24ప్రభాతవార్తప్రతినిధి:



తిరుపతి జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికల ఓట్ల లెక్కింపును నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్దమవుతోంది. తిరుపతి జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో జిల్లా పోలీసుయంత్రాంగం జిల్లా వ్యాప్తంగా కార్డన్‌సెర్చ్ చేస్తున్నారు. శుక్రవారం ఉదయం తిరుమలలోని స్థానికులు, వ్యాపారులు నివాసముంటున్న బాలాజీ నగర్‌ను తిరుమల పోలీసులు జల్లెడపట్టారు. ఇంటింటికీ వెళ్ళి ఇంట్లో నివాస ముంటున్న వారెవరు, ఎక్కడ నుండి వచ్చారు, వారికి సంబంధించిన వాహ నాలను తనిఖీ చేశారు. తిరుమల 2టౌన్ సిఐ ఎ.సత్యనారాయణ పర్యవేక్షణలో తిరుమల 2టౌన్ పోలీసులు ఈ కార్డన్‌సెర్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎటువంటి రికార్డులు, ఆధారాలు లేని 15 ద్విచక్రవాహనాలను స్వాదీనం చేసుకున్నారు. తిరుపతిజిల్లాలోనూ అన్ని సర్కిళ్ళపరిదిలోని ప్రధాన గ్రామాల్లో, కాలనీల్లో పోలీసులు కార్డన్‌సెర్చ్ చేశారు.

## ముగిసిన గోవిందరాజుని బ్రహ్మోత్సవాలు

–శాస్త్రోక్తంగా చక్రస్నానం

తిరుపతి,మే 24 ప్రభాతవార్త:



తిరుపతిలోని గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఉదయం చక్రస్నానమహోత్సవంలో ముగిశాయి. ఆళ్వార్‌తీర్థంలో ఈ పవిత్రమైన ఘట్టం నిర్వహించారు. చక్రత్తాళ్వార్ చక్రస్నాన సమయంలో భక్తులు,అర్చకులు, అధికారులుఅందరూ పుణ్య స్నానాలాచరించారు.

## కంచిపరమాచార్య చంద్రశేఖరస్వామి జయంతి వేడుకలు

తిరుపతి,మే 24ప్రభాతవార్త:



కంచికామకోటిమఠం పీఠాధిపతి పరమాచార్య చంద్రశేఖర మహాస్వామి జయంతిని శుక్రవారం తిరుపతిలో చిగోరా, రాయలసీమ రంగస్థలి సంయుక్తంగా నిర్వహించింది. చిగోరా ఆధ్యాత్మిక కేంద్రంలో స్వామివారి చిత్రపటం ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. కంచిమఠంలో స్వామివారి జీవితం, మఠంలో ఆయన సేవలను కొనియాడారు. హిందువులు మహానుభావులు, స్వామీజీల జయంతి ఉత్సవాలను జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిగోరా వ్యవస్థాపకుడు చిత్రపు హనుమంతరావు, శ్రీనివాసమూర్తి, శేషగిరిరావు, రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి మహాస్వామికి పుష్పాంజలి ఘటించారు.


## ధనకోటిగంగమ్మకు ప్రత్యేక పూజలు

తిరుపతి,మే 24ప్రభాతవార్త:



రాస్ పొదుపుసంఘాల మహిళలతో కలసి రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం సూచనలతో పిడి నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ధనకోటి గంగమ్మకు ప్రత్యేక జాతర పూజలు నిర్వహించారు. సుమారు 200మంది మహిళలు వేదమంత్రాల నడుమ గంగమ్మతల్లికి అభిషేకాలు, పూజలు ,అలంకరణ చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ముఖ్యఅతిధిగా చంద్రమౌళి పాల్గొని ధనకోటి గంగమ్మ విశేషాలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. గంగమ్మ తల్లి ఆశీస్సులతో అందరూ ఆయురారోగ్యాలతోఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రంగారెడ్డి, సభ్యులు నారాయణ, నాగేశ్వర్,కరుణాకర్, ముని,తులసమ్మ, క్లస్టర్ లీడర్లు, పాల్గొన్నారు

## ఏపీపీఎస్‌సీ పరీక్షలను పకడ్బందీగా చేపట్టాలి



తిరుచానూరు, మే 24 ప్రభాతవార్త:

డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ నియామకం కోసం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ నెల 25న జిల్లాలో 11 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించడం జరుగుతుందని, సంబంధిత శాఖలు సమన్వయంతో పకడ్బందీగా పరీక్షలను నిర్వహించాలని డీఆర్‌వో పెంచల కిషోర్ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోనే డీఆర్‌వో ఛాంబర్‌లో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ స్క్రీనింగ్ పరీక్ష నిర్వహణపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ భర్తీ కోసం స్క్రీనింగ్ పరీక్ష ఈ నెల 25న ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 11 కేంద్రాల్లో ఆబ్జెక్టివ్ టైప్ విధానంలో పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థుల మొబైలు ఫోన్‌లను డిపాజిట్ చేసుకోవడానికి పరీక్ష కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని కళాశాల యాజమాన్యానికి సూచించారు.

# తిరుపతి డివిజన్

## గుర్తు తెలియని వృద్దుడు హత్య!

చంద్రగిరి, మే 24 ప్రభాతవార్త:



గుర్తుతెలియని వృద్ధుడు హత్యకు గురై పడివున్న సంఘటన పనపాకం రైల్వే స్టేషన్ సమీపంలో వెలుగుచూసినట్లు సిఐ రామయ్య తెలిపారు. గ్రామస్థులు అందించిన సమాచారంతో శుక్రవారం హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకున్నట్లు తెలిపారు. రెండు రోజుల క్రితం వృద్ధుడి తలపై దాడిచేసి హత్య చేసినట్లుగా భావిస్తున్నట్లు తెలిపారు. మృత దేహం గుర్తు పట్టలేని విధంగా తయారైనట్లు తెలిపారు. శవపంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు వెళ్ళడించారు. వృద్ధుడిని దారుణంగా హత్య చేయడంపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## సమస్యాత్మక గ్రామాలలో పోలీస్ పికెట్ : డిఎస్పీ

చంద్రగిరి, మే 24 ప్రభాతవార్త:



ఎన్నికల అల్లర్ల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు డిఎస్పీ శరత్‌కుమార్ రాజ్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం విజయోత్సవ ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడం నిషేధించినట్లు తెలిపారు. రామిరెడ్డిపల్లి, కూచివారిపల్లి ఘటనలపై ఇప్పటికే 50 మందిపై కేసులు నమోదు చేశామనీ, త్వరలోనే వీరిని అరెస్ట్ చేస్తామన్నారు. అయితే అల్లర్లకు సంబంధం లేనివారిపై ఎటువంటి కేసులు వుండవన్నారు. రాజకీయ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ట్రైనీ ఐపిఎస్ పాటిల్ దేవరాజ్, సిఐ రామయ్య పాల్గొన్నారు.

## అమ్మవారి భక్తులకు అన్నదానం

చంద్రగిరి, మే 24 ప్రభాతవార్త:



సత్యప్రమాణాలకు నెలవై కొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయంలో శుక్రవారం అమ్మవారి భక్తులకు చంద్రగిరి పాతపేట, దిగువవీధికి చెందిన అంగేరి రమేష్ రెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. చంద్రగిరి గ్రామదేవతగా భక్తుల కొంగుబంగారమై కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారి భక్తులకు అన్నదానం చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు దాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ పుట్టా రామకృష్ణారెడ్డి, చిన్నకాళప్పగారి ప్రకాష్ రెడ్డి, దాతలకు అమ్మవారి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు 591 మంది గైర్హాజరు



తిరుపతి విద్య, మే 24 ప్రభాతవార్త :

శుక్రవారం ప్రారంభమైన ఇంటర్ ద్వితియ, ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలలో జిల్లా వ్యాప్తంగా 591 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని ఆర్ఐఓ ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

## పౌర సరఫరాల గోదాము తనిఖీ

నగరి, మే 24 ప్రభాతవార్త:



పట్టణ పరిధిలోని పౌర సరఫరాల గోదామును ఆర్డీవో వెంకటరెడ్డి తనిఖీ చేశారు. శుక్రవారం గోదాముకు సిబ్బందితో పాటు వెళ్లిన ఆయన ఆన్‌లైన్‌లో చూపుతున్న సరకు నిల్వ, గోదాములో ఉన్న సరకు నిల్వ ఒకేలా ఉన్నాయా...లేవా...? అన్న అంశాలను పరిశీలించారు. బియ్యం, పోర్టిఫైడ్ బియ్యం, కందిపప్పు, పామాలియన్, రాగి పిండి, గోదుమ పిండి, చక్కెర నిల్వలను విడి విడిగా లెక్కించి సరి చూశారు. సరకుల నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించారు. చూపుతున్న నిల్వల మేరకు గోదాములో సరకు ఉన్నట్లు తేల్చారు. సరకులను సరైన సమయాల్లో ఆయా దుకాణాలకు సరఫరా చేయాలని గోడౌన్ డీటీకి సూచించారు. ఈ తనిఖీలో డీఎస్‌వో శంకరయ్య, తహసీల్దార్ చంద్రశేఖర్, గోడౌన్ ఇన్‌చార్జి పి.ఆదం తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణ కార్యక్రమానికి గైర్హాజరైన వారికి షోకాజ్ నోటీసులు :కలెక్టర్

తిరుచానూరు, మే 24 ప్రభాతవార్త:

సార్వత్రిక ఎన్నికలు 2024లో భాగంగా పీవో, ఏపీవో, పోలింగ్ సిబ్బందికి ఇచ్చిన రెండవ దఫా శిక్షణ కార్యక్రమానికి గైర్హాజరైన 14 మందికి షోకాజ్ నోటీసులు కలెక్టర్ జారీ చేయగా అందులో వారు సమర్పించిన వివరణ సంతృప్తికరంగా లేనందున 5మందిని సస్పెండ్ చేసినట్లుగా, పోలింగ్ విధులకు గైర్హాజరైన 272 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణ అనేది ప్రజాస్వామ్యంలో ఒక గొప్ప బాధ్యతతో కూడిన కర్తవ్యమని, ఉద్యోగులు తమకు కేటాయించబడిన ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వర్తించాలని తెలిపారు. కానీ కొందరు పీవో, ఏపీవో, పోలింగ్ సిబ్బంది వారికి ఏర్పాటు చేసిన రెండవ దఫా శిక్షణ కార్యక్రమానికి గైర్మాజరైన 14 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశామని, అందులో వారు సమర్పించిన వివరణ సంతృప్తికరంగా లేనందున 5 మందిని సస్పెండ్ చేసినట్లుగా కలెక్టర్ తెలిపారు. అలాగే పోలింగ్ విధులకు గైర్హాజరైన 272 మందికి రాత పూర్వక సంజాయిషి కొరకు అండర్ సెక్షన్ 134 ఆర్‌పీ ఏసీటీ ప్రకారం షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరిగిందని, దీనికి 5 రోజుల్లో వారి నుంచి సంతృప్తికరమైన సమాధానం రాకపోయిన ఏడల ఎన్నికల విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించినందు వలన ఎన్నికల నియమావళి ప్రకారం తగు చర్యలు గైకొనబడునని కలెక్టర ఆ ప్రకటనలో తెలిపారు.

## గుండెపోటుతో ఒకరు మృతి!

కేవీబీ పురం, మే 24 ప్రభాతవార్త:

మండలంలోని పెరిందేశం దళితవాడకు చెందిన చెందిన తలారి పాండు(46) గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. మండల ఎంపీపీ రాయదుర్గమ మునిలక్ష్మి నందకుమార్, రాష్ట్ర ముదిరాజ్ సంఘం డైరెక్టర్ తరణి ధనంజయరెడ్డి, పలువురు కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పాండు కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ఐటీఐలో దరఖాస్తులు ఆహ్వానం

విజయపురం, మే 24 ప్రభాతవార్త:

మండలంలోని మాధవరం ఐటీఐలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను మొదటి విడత అడ్మిషన్ కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గణేష్ తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు జూన్ 10 తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అంతర్జాలంలో ఐటీఐ, ఏపీ, జీవోవీ ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మెరిట్ ఆధారంగా చిత్తూరు ఐటీఐ కళాశాల ఆవరణలో జూన్ 18 నుంచి 26 తేదీ వరకు నిర్వహించే కౌన్సిలింగ్‌లో పాల్గొనాలన్నారు.

## ఘనంగా ఐఎఫ్‌బి షోరూం ప్రారంభం

తిరుపతి హెల్త్, మే 24 ప్రభాతవార్త :

హోమ్ అప్లియన్స్ రంగంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఐఎఫ్‌బి వారి ఎక్స్క్లూజివ్ షోరూం ఇప్పుడు మన తిరుపతి కరకంబాడి రోడ్డులో ఉన్న రెండు మద్యమానులు దగ్గర ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాన్ డిస్ట్రిబ్యూషన్ హెడ్ రాఘవేంద్ర ఇచ్చేసి షోరూంను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిరుపతిలో ఐఎఫ్‌బి బ్రాంచ్‌ని ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమన్నారు. అంతేకాకుండా ఈ షోరూమ్‌లో అందరికి అందుబాటులో అన్ని రకాల కొనుగోళ్లకు క్యాష్ బ్యాక్ ఆఫర్ ఉందని, ఎంపిక చేసిన మోడల్స్‌పై ఫైనాన్స్ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. ఎంపిక చేసిన మోడల్స్‌పై క్యాష్ బ్యాక్ సదుపాయం కూడా ఉందన్నారు. ఐఎఫ్‌బి షోరూంలో ప్రతి ప్రొడక్ట్స్ పైన డిస్కౌంట్స్ ఉంటాయని దీన్ని తిరుపతి ప్రజలు సద్వినియోగంచేసుకోవాని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌బి షోరూం ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.


**CHANGE OF NAME**

I,**Kancharla Madana MohanaRao**, (old Name) R/o,F no:301, Padmavathipuram, temple view residency, Tirupati Dt Ap. Have Changed My Name and as **KANCHARLA MADAN MOHAN** (New name), S/O KANCHARLA MALYADRI

# పకడ్బందీగా ఎపిపిఎస్సి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

## - అభ్యర్థులు ఒక్క క్షణం ఆలస్యమైనా నో ఎంట్రీ
## - జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య



చిత్తూరు, మే 24 ప్రభాతవార్త:

డిప్యుటీ డిఇఓల నియామకం కోసం ఎపిపిఎస్సి ఆధ్వర్యంలో శనివారం నుండి ప్రారంభం కానున్న పోటీ పరీక్షలను పకడ్బందీగా న్విహించడానికి ఏర్పాట్లు చేపట్టామని జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య అన్నారు. డిఆర్ఓ ఛాంబర్లో శుక్రవారం డిఆర్ఓ బి.పుల్లయ్య పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మాట్లాడుతూ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ల ఉద్యోగ నియామకాల కోసం శనివారం జిల్లా వ్యాప్తంగా మూడు పరీక్షా కేంద్రాల్లో ఆబ్జెక్టివ్ టైప్ పరీక్షలు నిర్వహించనున్నారన్నారు. ఈ పరీక్షలకు 730 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. చిత్తూరులోని సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో 150 మంది అభ్యర్థులు, పూతలపట్టు మండలంలోని వేము ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో 330 మంది అభ్యర్థులు, పలమనేరులోని మథర్థెరిసా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల పరీక్షా కేంద్రంలో 250 మంది అభ్యర్థులు పోటీ పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 11.30 గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను ఉదయం 7 గంటల నుండి 8.30 గంటల మధ్య మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందన్నారు. క్షణం ఆలస్యమైనా అభ్యర్థులను ఎట్టి పరిస్థితుల్లోను పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరుగదని జిల్లా రెవెన్యూ అధికారి స్పష్టం చేశారు. పరీక్షలకు హాజరయ్యే వారిలో ఎవరైనా దివ్యాంగులు వుంటే తమకంటే తక్కువ విద్యార్హత వున్న వారిని సహాయకులుగా తమ వెంట తీసుకురావచ్చునన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే అభ్యర్థులకు రవాణా సదుపాయం కోసం ఆర్టీసీ అధికారులు తగు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఆబ్జెక్టివ్ తరహాలో కంప్యూటర్ల మీద పరీక్ష రాయాల్సి వుండటంతో నిరంతర విద్యుత్ సరఫరా వుండేలా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్కో అధికారులను డిఆర్ఓ ఆదేశించారు. అలాగే పరీక్షా కేంద్రాల ఆవరణలో వైద్య ఆరోగ్యశాఖ ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేసుకోవాలని, పోలీసు శాఖ పరీక్షా కేంద్రాల వద్ద తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, డిజిటల్ వాచ్లు వంటి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్ళకూడదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులు హాల్టికెట్, గుర్తింపు కార్డు, వాటర్ బాటిల్ మాత్రమే అనుమతిస్తారన్నారు. అభ్యర్థులు మొబైల్ ఫోన్లను డిపాజిట్ చేయడం కోసం పరీక్షా కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని కళాశాల యాజమాన్యాలకు డిఆర్ఓ సూచించారు. అలాగే పరీక్షా కేంద్రాల పరిసరాల్లో పరీక్షలు జరిగే సమయంలో 144 సెక్షన్ అమలులో వుండేవిధంగా రెవెన్యూ, పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఆర్టీసీ అధికారి కేశవమూర్తి, ట్రాన్స్కో అధికారి కేశవులు, వైద్య ఆరోగ్యశాఖ నుండి డాక్టర్ శిరీష, టుటౌన్ ఇన్స్పెక్టర్ కుల్లయ్యప్ప ఎస్ఐ ఉమామహేశ్వర్రెడ్డి, కలెక్టరేట్ సి-సెక్షన్ సూపరిటెండెంట్ గుణశేఖర్రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ అంజనా తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ విద్యార్థినికి ఆర్థిక సహాయం

కోట, మే 24 ప్రభాతవార్త :



కోట మండలం విద్యానగర్లోని ఎన్బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడవ సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్న సంగీత పల్లవి అనే విద్యార్థికి శ్రీషిరిడి సాయి అక్షయ సేవాసమితి వారు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం స్థానిక కోటమ్మ ఆలయంలో సంగీత పల్లవి తల్లిదండ్రులకు నగదు అందజేశారు. ఇప్పటికి వరుసగా రెండుసార్లు ఆ పేద విద్యార్థినికి ఫీజు ఖర్చుల కింద సహాయం చేసినట్లు ఛైర్మన్ అల్లం రమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లిదండ్రులు ఆర్థిక సహాయం చేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీకాళహస్తి రెవెన్యూ అధికారుల తీరే వేరయా!

శ్రీకాళహస్తి,మే 24 ప్రభాతవార్త :




శ్రీకాళహస్తి నియోజకవర్గ రెవెన్యూ అధికారుల తీరే వేరయా అన్నట్లు మారింది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అత్యధిక సమస్యలు రెవెన్యూశాఖకు సంబంధించినవే. ఎక్కడ చూసినా భూ ఆక్రమణలు, ఎక్కడ చూసినా రికార్డులు మార్పిడి. పలుకుబడి ఉన్న వారు యథేచ్ఛగా ఖాళీ కనబడితే చాలు వేసేయ్ పాగా అన్నట్లు మారింది. శ్రీకాళహస్తి ఆర్డిఓ, తహశీల్దార్లుకు ఎంత ముఖ్యమైన సమస్యకు సంబంధించిన సమాచారం కోసం ప్రయత్నించినా ఆర్డిఓ ఫోన్ తీయరు. ఓ కీలక అధికారి ప్రజాసమస్యలకు సంబంధించిన సమాచారం కోసం ప్రజలు ప్రయత్నిస్తే చరవాణి తీయకుంటే ఎలా అని చర్చించుకుంటున్నారు. ఇక ఆ అధికారియే ఎన్నికల అధికారిగా వ్యవహారించారు. ఎన్నికల తరువాత లెక్కింపుకు సంబంధించిన ప్రక్రియ ఎలా ఉంటుందో తెలుసుకోవాలన్న ఉత్సుకత ప్రజల్లో ఉంది. అయితే ఆ అధికారియే ముందుగా ప్రజలకు సమాచారం కోసం ప్రకటించాలి. అలా చేయరు. పైగా మీడియా ప్రతినిధులు సమాచారం కోసం ప్రయత్నించినా ఫోన్ తీయరు. పరిశీలిస్తాం. అంటూ చెబుతారే తప్ప వాస్తవాలు చెప్పటానికి ఎందుకో ప్రయత్నించరు. ఆర్డిఓ కార్యాలయం పాలనంతా రహస్యంగా సాగుతుందని జనం చర్చించుకుంటున్నారు. యథా రాజా తథా ప్రజా అనే సామెత ఉంది. ఈ నేపథ్యంలోనే ఆర్డిఓ అడుగుజాడల్లోనే మండల తహశీల్దార్లు కూడా పని చేస్తున్నరని చెప్పవచ్చు. ముఖ్యంగా శ్రీకాళహస్తి తహశీల్దార్ కూడా చరవాణిని తీయరు. ఇక రాజీవ్ నగర్లో విచ్చల విడిగా నిరుపేదల పట్టాలను ఆక్రమణలకు గురౌతుంటే రెవెన్యూశాఖకు చీమ కుట్టినట్లు కూడా లేదు. ఇక్కడే ఆర్డిఓ కార్యాలయం ఉన్నా పట్టించుకునే దిక్కు లేదు. ఇలా ప్రజా సంబంధాలతో ముడిపడ్డ అధికారులు ప్రజలకు జవాబుదారి తనంగా లేకుండా ఉంటే తమ బాధలను ప్రజలు ఎవరికిచెప్పుకోవాలి?

## కల్పవృక్ష, సర్వభూపాలవాహనాలపై మువ్వగోపాలుని సాక్షాత్కారం

నారాయణవనం, మే 24 ప్రభాతవార్త :



నారాయణవనం పుణ్యక్షేత్రంలో వెలసిన పద్మావతీదేవి సమేత కల్యాణ వే ంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న నాల్గవరోజు శుక్రవారం ఉదయం కల్పవృక్ష వాహనంపై మువ్వాగోపాలుని అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వగా, రాత్రి 7గంటలకు సర్వభూపాలవాహనంలో సీతారామ సమేత లక్ష్మణుని అవతారంలో నగరవీధుల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి 7గంటలకు శ్రీవారు సర్వభూపాలవాహనంపై మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాటం, చెక్కభజనల నడుమ ఊరేగారు. భక్తులు అడుగడుగునా టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీఇఓ నాగరత్న, ఎఇఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితంఇన్స్పెక్టర్ భరత్, సివిల్ ఇంజనీర్ గురుప్రసాద్, వివిధ శాఖలకు చెందిన టిటిడి అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

**నేడు నారాయణవనంలో గరుడసేవ :**

నారాయణవనం కల్యాణవేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోతవాల్లో అతి ముఖ్యమైనా దినం గరుడసేవ శని వారం రాత్రి 7నుంచి9.30గంటల వరకు నిర్వహించడానికి టిటిడి అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చే స్తున్నారు. ఉదయం7.30గంటలకుపల్లకీసేవ, మోహినిఅవతారంలోశ్రీవారుగ్రామపురవీధుల్లోఊరేగనున్నారు

## అవాంఛనీయ సంఘటనలు జరిగితే కఠిన చర్యలు : డిఎస్పీ

గూడూరు, మే 24 ప్రభాతవార్త :



ఎన్నికల కోడ్ అమలులో ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని, అలాంటి వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి హెచ్చరించారు. గూడూరులోని ఒకటో పట్టణ పోలీసు స్టేషన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏర్పాటు చేసిన విలేకరఉల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గూడూరులోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. త్వరలో కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో ఆయన సమావేశంలో పలు హెచ్చరికలు జారీ చేసారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున డివిజన్ పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. డివిజన్లో సమస్యాత్మక ప్రాంతాలను తాము గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు మొబైల్ పోలీసులు తిరుగుతుంటారన్నారు. ఎక్కడైనా ఘర్షణలకు పాల్పడితే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. కౌంటింగ్ తరువాత రాజకీయ పార్టీల నాయకులు బాణాసంచా కాల్చి ర్యాలీలు చేపట్టడం వంటివి నిషేదమని డిఎస్పి వివరించారు.

## అవాంఛనీయ సంఘటనలపై పోలీసుల మాక్ డ్రిల్

### -కౌంటింగ్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు


తొట్టంబేడు, మే 24 ప్రభాతవార్త :



వచ్చేనెల 4వ తేదీన పద్మావతీ మహిళా యూనివర్సిటీలో జరిగే అవాంఛనీయ సంఘటనలపై పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు శుక్రవారం స్థానిక ఆర్టీసి బస్టాండు వద్ద మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శాంతిభద్రతల అడిషనల్ ఎస్పీ కులశేఖర్ మరియు స్థానిక డిఎస్పీ ఉమామహేశ్వరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఏప్రాంతాలో అయినా అవాంఛనీయ సంఘటనలు జరిగినపుడు ఒకేచోటు గుంపులుగా ఉన్న ప్రజలు ఏవిధంగా ఈప్రాంతం నుంచి చెదరగొట్టాలో మాక్డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జూన్ 4వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపు పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు రాష్ట్రం మొత్తంపై నిర్వహించే మాక్ డ్రిల్ శ్రీకాళహస్తి డివిజన్ ప్రాంతంలో ఆర్టీసి బస్టాండు సర్కిల్ వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. శాంతి భద్రతల డిఎస్పీ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తిరుపతి జిల్లా పోలీసులు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. ఇటీవల శ్రీకాళహస్తిలో ఎన్నికల సంఘంనందు కొన్ని చోట్లు అవాంఛనీయ సంఘటనలు జరిగిన దృష్ట్యా రాబోవు కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా పోలీఉలు తగిన చర్యలు తీసుకోవడం జరిగిందని జూన్ 4వ తేదీన ఓటింగ్ ప్రక్రియ నిర్వహించేటపుడు నిర్వహించిన అనంతరం జిల్లా పరిసర ప్రాంతాల్లో ఎక్కడ ఆకతాయిలు ఎక్కడైనా అసంఘటిత చర్యలకు పాల్పడితే వారిని ఏవిధంగా చెదరగొడుతారో నేడు ప్రజలకు మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించామన్నారు. అనంతరం అల్లర్లకు పాల్పడితే భాష్పవాయువు ప్రయోగించడం, ఎక్కువగా అల్లర్లు చేస్తే గాలిలో కాల్పులు జరిపి ప్రజలకు చూపించారు. శ్రీకాళహస్తిలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అక్కడక్కడ పోలీసు ఫికెట్లు చేసి నిఘా నేత్రం ఏర్పాటు చేశామని ఇందులో భాగంగా ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అందులో పోలీసు పికెట్లను ఏర్పాటు చేశామని అదేవిధంగా ప్రతి పోలీస్స్టేషన్ పరిధిలో పోలీసు మొబైల్ పార్టీలు, క్యూఆర్టి టీం ఏర్పాటుచేయడమే కాకుండా వారి ప్రతి కదలికను గమనిస్తూ డివిజన్ ప్రాంతంలో ప్రతి ఇంటింటా పరిశీలిస్తున్నామన్నారు. కౌటింగ్ తర్వాత కానీ సభలు, సమావేశాలు విజయోత్సవర్యాలీలు నిషేధించారని నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే అలాంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని పార్టీల నాయకులు పోలీసు వారికి సహకరించి ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా ముగించుటకు సహరించాలని అందరినీ అభ్యర్థించారు. అనంతరం శాంతిభద్రతల డిస్పీ కులశేఖర్, డిఎస్పీ ఉమామహేశ్వరరెడ్డిలు ప్రత్యేక బలగాలు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిఐలు నరసింహరావు, రారాజు, అజయ్కుమార్, ఎస్ఐలు రాఘవేంద్ర పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పుత్తూరు సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు

నారాయణవనం, మే 24 ప్రభాతవార్త :



పుత్తూరు సమీపం నారాయణవనంలోని సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం బీటెక్ గ్రాడ్యుయేషన్ వేడుకలు ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిధిగా డాక్టర్ బుద్ద చంద్రశేఖర్, చీప్ కో ఆర్డినేటర్ ఆఫీసర్ ఏఐసిటిఇ మరియు చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ మినిస్ట్రి ఆఫ్ ఎడ్యుకేషన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఉన్నత విద్యా మండలి డాక్టర్ హేమచంద్రారెడ్డి, కళాశాల ఛైర్మన్ డాక్టర్ కె అశోకరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిస్టెక్ కళాశాలలో మొత్తం 386మంది విజయవంతంగా తమ బీటెక్ కోర్సును పూర్తి చేసుకొని డిగ్రీలను పొందారు. వీరిలో గోల్డ్ మెడల్స్ సాధించిన వారు సునీల్కుమార్రెడ్డి, సాయి శరణ్య, అనుష, అనూష, నాగబ్రహ్మనారాయణరెడ్డిలకు గోల్డ్ మెడల్తో పాటు మెరిట్ సర్టిఫికేట్లను అందించారు. అలాగే సైటెక్లో 854మంది డిగ్రీలను పొందారు. వీరికి బుద్ద చంద్రశేఖర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్స్ను మహేష్, సుచిత్ర, సుధాకర్, మధుమిత, మునిసాయి, లేఖక్ష, హరీష్, శ్రీలేఖ, కళాంజలిలకు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ చదువుకోవడం కేవలం జ్ఞానాన్ని సంపాధించుకోవడం కోసమేనని, చదువు పూర్తి చేసిన తర్వాత ఉద్యోగంలో స్థిర పడిన తర్వాత అనుభవంతో మరింత నేర్చుకోవడం జరుగుతుం దన్నారు. వారి వారి టాలెంట్ను బట్టి ఉన్నత కంపెనీల్లో ఉద్యోగాలను పొంది కళాశాలకు, కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. టెక్నాలజీ రంగాల్లో సిద్దార్థకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ చంద్రశేఖర్రెడ్డి, జనార్ధన్రాజు, హెచ్ఓడిలు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు ఎపిజిబి ద్వారా మెరుగైన సేవలు

### – ఆంధ్రాప్రగతి గ్రామీణ బ్యాంకు ఛైర్మన్ సత్యప్రకాష్ సింగ్

చిట్టమూరు, మే 24 ప్రభాతవార్త



చిట్టమూరు మండలంలోని తీరప్రాంత గ్రామమైన మల్లాంలో ఉన్న ఆంధ్రాప్రగతి గ్రామీణ బ్యాంకు ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు ఆ బ్యాంకు ఛైర్మన్ సత్యప్రకాష్ సింగ్ తెలియజేశారు. శుక్రవారం మల్లాం గ్రామంలో ఎపిజిబి నూతన భవన ప్రారంభోత్సవానికి ఆయన హాజరై వినియోగదారులకు పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గ్రామీణ బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన వినియోగదారులకు మిగతా బ్యాంకుల కంటే వడ్డీ శాతం అధికంగా ఉందన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకంలో 18 నుంచి 50 సంవత్సరాల వారు ఏడాదికి రూ.436 చెల్లిస్తే వారికి సహజ మరణమైతే రూ.2 లక్షలు బీమా వస్తుందని, అలాగే ప్రధానమంత్రి సురక్ష యోజన పథకం కింద 18 నుంచి 70 సంవత్సరాలు కేవలం రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల బీమా వర్తిస్తుందని అన్నారు. పంట రుణాలు పొందిన రైతులు సకాలంలో రుణాలు చెల్లించి వడ్డీ మాఫీ పొందవచ్చని, పొదుపు సంఘాలు సైతం సకాలంలో తమ బ్యాంకు రుణాలు చెల్లిస్తే పావలా వడ్డీ పథకానికి అర్హులని చెప్పారు. అంతకుముందు బ్రాంచి మేనేజర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఛైర్మన్కు పూర్ణకుంభం, మేళతాళాలతో బ్యాంకు సిబ్బందితో పాటు స్థానికులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఛైర్మన్ సత్యప్రకాష్ సింగ్తో పాటు రీజనల్ మేనేజర్ మోహన్రెడ్డి, చీఫ్ మేనేజర్ ఆంజనేయులు, బ్రాంచి మేనేజర్ శ్రీకాంత్, పొదుపు సంఘాలు, రైతులు, విఓఏలు, బ్యాంకు బిజినెస్ కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

## కళ్యాణం కమనీయం చెన్న కేశవ స్వామి కళ్యాణం

శ్రీకాళహస్తిరూరల్,మే 24 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు గ్రామంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కళ్యాణోత్సవం కన్నుల పండువగా శుక్రవారం సాగింది. ఉదయం తిరువాచ్చి ఉత్సవాన్ని ఘనం గా నిర్వహించారు. స్వామి అమ్మ వార్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి కళ్యాణోత్సవాన్ని ఘనంగా ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆలయ ఇన్చార్జి లక్ష్మయ్య, దుర్గా ప్రసాద్లు చక్కటి ఏర్పాట్లు చేసారు. గ్రామస్థుల సహాకారంతో గ్రామాన్ని నిత్యకళ్యాణం పచ్చతోరణంలా మార్చారు. ఇక ఆలయాన్ని కళ్యాణ వేదికగా తీర్చి దిద్దారు. ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం కళ్యాణోత్సవం సందర్భంగా ఆలయం తరపున ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పట్టువస్త్రాలను సమర్పించారు. ఉభయదారులు కాపిరెడ్డి అనిల్రెడ్డి కుటుంబసభ్యులతో హాజరు కాగా పట్టు వస్త్రాలను అందించారు. పట్టు వస్త్రాలను అందించేందుకు ఛైర్మెన్ శ్రీనివాసులతో పాటు ఆలయ ఎసి మల్లికార్జున్ ప్రసాద్, చిన్న ఆలయాల ఇన్చార్జి లక్ష్మయ్య, సహాకుడు దుర్గా ప్రసాద్లు పట్టు వస్త్రాలను ఆలయ పూజారులకు అందించారు. అర్చకులు అనిల్కుమార్, ఉపప్రదానార్చకులు దక్షిణామూర్తి, చెన్నకేశవ స్వామి ఆలయ పూజారి శర్మలు హాజరయ్యారు. స్వామి అమ్మవార్లకళ్యాణాన్ని హిందూ సంప్రాయం మేరకు పండిత పామరులకు అర్థమయ్యే రీతిలో నిర్వహించారు. చివరగా తలంబ్రాలు మాంగల్యధారణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గజవాహనంపై స్వామి అమ్మవార్లను ప్రతిష్టించి వధూవరులుగా ఊరేగింపుజరిపారు.

## సగం వరకు పూడిపోయిన బోరు!

### -నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు

పాకాల, మే 24, ప్రభాతవార్త :




పాకాల పట్టణంలోని పూరిపేటలో ఉన్నటువంటి చేతిపంపు బోరు గత కొంతకాలంగా నిరుపయోగంగా మారింది. వివరాల్లోకి వెళితే.. గతంలో ఈ బోరు పూరిపేట మొత్తానికి తాగునీటటిని అందించిన ఘనత ఈ బోరుకు ఉంది. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రజలకు తాగునీటి సౌకర్యార్థం కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు మంజూరు చేస్తుంది. అయినప్పటికీ ప్రభుత్వ అధికారులు వైపు నుంచి పాడైపోయిన బోర్లను మరమ్మతులు చేయాలనే ఆలోచన రాకపోవడం బాధాకరం. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహించడం కడు శోచనీయం. గ్రామాల్లో నీటి సరఫరా, పరిశుభ్రత అనేటివి ప్రశ్నార్థకంగా మారాయి. చేతి పంపు బోరింగు ఎప్పుడు బాగుపడి తమ దాహార్తిని తీరుస్తుందని సమీప ప్రజలు వాపోతున్నారు. ఇంతటి సమస్యతో ప్రజలు అల్లాడుతుంటే అధికారులు నిద్రమత్తులో వ్యవహరించడం బాధాకరం. ఈ చేతి పంపు బోరింగ్ ద్వారా కేవలం పూరిపేట ప్రజలు మాత్రమే కాకుండా పాకాల పట్టణం మొత్తం ప్రజలు ఈ నీటిని వినియోగించుకుంటున్నారు. అయితే ఎందుకు ఇంత ఉపయోగం ఉన్న బోరును అధికారులు గాలికి వదిలేసారన్నది వెయ్యి డాలర్ల ప్రశ్నగా మారింది. పంచాయితీ నీళ్ల కోళాయిల ద్వారా ప్రజలకు చేరుతున్నప్పటికీ అందుబాటులో ఉన్న చేతి బోర్లను నిర్లక్ష్యం చేయడం ఏ మాత్రం తగదని స్థానిక ప్రజలు భావిస్తున్నారు. ప్రస్తుతం పంచాయితీ సరఫరా చేస్తున్న కొళాయి నీళ్ల సక్రమంగా వస్తున్నప్పటికీ, రేపు చిన్నపాటి కారణాలతో ఈ నీటి సరఫరా ఆగిపోతే ప్రజల పరిస్థితి ఏంటి? పరిస్థితి బాలేకపోతే నీటి సరఫరా అయ్యే పైపులు పగిలిపోవచ్చు. లేదు నీటి పైపుల వాళ్లలో సమస్య రావచ్చు. అలాంటి సందర్భంలో ప్రజలు తాగునీటికి కటకటలాడాల్ని వస్తుంది. కాబట్టి ఇకనైనా అధికారులు రాబోయే సమస్యను ముందుగా గ్రహించి మరమ్మతులకు గురైన చేతిపంపు బోరును తక్షణం బాగు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

# అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు : డీఎస్పీ

రేణిగుంట, మే 24 ప్రభాతవార్త:



సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం అల్లర్లకు పాల్పడితే జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కఠినమైన చర్యలు తీసుకుంటామని రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్ అన్నారు. రేణిగుంట అర్బన్ పోలీస్స్టేషన్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. అదే విధంగా జూన్ 4 తేదీ ఎన్నికల ఫలితాల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరగడానికి అందరూ సహకరించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని జిల్లాలో ఎన్నికల సమయంలో అల్లర్లు జరగడం వల్ల ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం పోలీసు ఉన్నతాధికారులు శాంతిభద్రతలను కాపాడడం కోసం నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. గెలిచిన పార్టీ కి సంబంధించిన వ్యక్తులు ఓడిపోయిన పార్టీకి సంబంధించిన వారిన అవమాన పరచకూడదన్నారు. ఓడిపోయిన పార్టీకి చెందిన వారు బాధతో దాడులకు పాల్పడరాదన్నారు. ఎవరు దాడుల్లో పాల్పడినా, అల్లర్లు సృష్టించినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే సమస్యాత్మక గ్రామాలను గుర్తింకి పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. అల్లర్లు సృష్టించడం, దాడులు చేయడం కోసం మారణాయుధాలను నిలువ ఉంచిన ప్రాంతాలను గుర్తించడానికి కార్డాన్ సర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన అనంతరం ఎలాంటి సభలు, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదన్నారు. బాణసంచా వేడుకలు, లౌడ్ స్పీకర్లు పెట్టకూడదన్నారు. వాట్సాప్ గ్రూపులో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, మనోభావాలు దెబ్బతినే పోస్టింగులు పెట్టవద్దన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలో 15 మొబైల్ పార్టీలు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉంటాయన్నారు. ఎక్కడ చిన్న సమస్య సృష్టించినా కారకులను అరెస్టు చేస్తామన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన సుమారు 30 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో అర్బన్ సీఐ మల్లికార్జున్, అర్బన్ ఎస్ఐ అరుణ్కుమార్రెడ్డి పాల్గొన్నారు.